ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జూన్ 14, 2009



మన పార్లమెంటు

సర్వోన్నత సమారోహం

హ్యాపీ బర్త్‌డే

(2009 జూన్ 7 నుంచి
2009 జూన్ 13 వరకు)

కె. జగదీష్
7సం॥,జూన్-12
విజయలక్ష్మి-శ్రీను
మచిలీపట్నం-కృష్ణా

నవీన్ కుమార్
జూన్-16
సైదమ్మ-మోహన్
ఈదులూరు

కె. హిమ వర్షిణి
2సం॥,జూన్-17
శ్రీనివాసరావు-సత్యవాణి
శ్రీకాకుళం

కె. దివిజ
జూన్
సుస్మిత-మహేష్
నరసరావుపేట-గుంటూరు

షేక్ వలి
జూన్
మహబూబ్‌బాషా
పెద్దపాడు-కర్నూలు

షక్నబీ
జూన్
మహబూబ్‌బాషా
పెద్దపాడు-కర్నూలు

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

రైతు రాసిన ఉత్తరం

ఓ ప్రియతమా, మా ప్రాణమా,

లేకలేక రాస్తున్న లేఖ ఇది. పొలికేకో, గావుకేకో తప్ప ఈ లేఖల అవసరం నాకెప్పుడూ రాలేదు. నువ్వు వచ్చినట్టే వచ్చి రాకపోయేసరికి... ఈ లేఖ రాస్తున్నాను. నాకు కవిత్వం రాయడం రాదు. కతలు చెప్పడం రాదు. అందుకే అనుకున్నది అనుకున్నట్టుగా రాస్తున్నా. తప్పులుంటే మన్నించు. తప్పకుండా అరుదెంచు.

నా ప్రాణమా,

ఈసారి నువ్వు ముందే వస్తున్నట్టు కబురు విని చాలా సంతోషించాను. నాగళ్లను సరిచేసుకొని, కాడెడ్లను సిద్ధం చేసుకొని... అప్పటినుంచీ నీ రాక కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను. నువ్వు వస్తున్నట్టే, వచ్చినట్టే ఏదో సవ్వడి వినిపిస్తుంది... అంతలోనే ఆ ఆనందం ఆవిరైపోతోంది. రోజూ ఇదే తంతు. ముందస్తు సరి కదా, రావాల్సిన తరుణమూ వచ్చేసింది! అయినా, రావేం? ఎందుకీ దోబూచులు?

అవును తల్లీ.. నువ్వు వచ్చే వేళకు మా రాజ్యం నిండా ఎన్నికల హడావిడే సాగుతోంది కదా? కొంపదీసి ఏ అబద్ధాల నాయకుడి కోతలైనా విన్నావా? హామీలిచ్చి వదిలేయడం, మురిపించి మరిచిపోవడం చూశావా? ఆ లక్షణం నీకూ అబ్బిందా? లేకపోతే- ఏమిటీ దొంగాట? తల్లీ, నీకూ నాకూ అది అలవడకూడని లక్షణం. మనం చేతల్లో చూపాల్సినవాళ్లమే కాని హడావిడితో మభ్యపెట్టాల్సిన వాళ్లం కాదు.

రామ్మా రా..! వచ్చివచ్చి వెనక్కి పోకు.. మా ఆశలపై కావల్సినన్ని నీళ్లు పొయ్యి. మా పొలాల్లో పరవళ్లు తొక్కు. పచ్చదనం పురి విప్పేలా ఆడూపాడు. అల్లరల్లరి చెయ్యి. జడుచుకునేలా ఉరుము. తడిచితడిచి వణికిపోయేలా కురువు. చెరువూ గరువూ, ఏరూ ఊరూ నీరు నిండేలా పరవశించు... నువ్వు కురిసి మురిపించిన రోజున పల్లెల ప్రగతి సూచి ఎంతపైకి పోతుందో చూడు.

వానతల్లీ,

నీకు తెలుసు కదా... నాకిక్కడ బోలెడన్ని సమస్యలున్నాయి. విత్తనాల కొరత.. ఎరువుల కొరత... కల్తీల సమస్య.. ఇవి ఎప్పటికప్పుడు ఏలినోళ్లకు కొత్తే.. ప్రతి ఏడాదీ పాత సమస్యే పునరావృతం... ఏదోలా పోరాడి అవి సాధించుకుంటాం. ఈ సమస్యలన్నింటితో నువ్వూ ఒక సమస్య కాకే తల్లీ... నువ్వంటూ వస్తే ఇవన్నీ మాకొక లెక్క కాదు. నువ్వే రాకుంటే ఇక అంతే...!

రామ్మా.. రా! చినుకులా రా... చిన్నిచిన్ని జల్లులా రా... ఓ మోస్తరు వానలా రా... భూమితల్లికి ముసుగు వేద్దాం..., ముసురులా రా... నీ ఇష్టం, నీతోపాటు కొంత అసౌకర్యమూ, కొంత చికాకూ చింతా తీసుకురా... దామ్మా దా... నీ ఇష్టమొచ్చినట్టు నర్తించు... ప్రవర్తించు... నింగీనేలా ముచ్చటించుకునేదీ, చెట్టూచేమా చివుర్లెత్తేదీ, పల్లేపట్నమూ పరవశించేదీ, ఏరూ నీరూ ఉరకలెత్తేదీ నీ రాకతోనే కదా... రా నేస్తం,.. రా.. నన్ను అన్నదాతగా ఆనందపడనీ, ప్రాణదాతగా నీ ప్రస్థానం సాగనీ...

నీ రాకకోసం ప్రతి క్షణం ఎదురుచూసే...

నీ రైతు

★★★

కథా నిలయం

ఈ సంచికలో....

టపో కుం	...	2
రుచి	...	3
ఆరోగ్యం	...	6
చూద్దామా	...	7
సీరియల్	...	8
తెల్సా	...	11
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కవిత్వమ్	...	17
క్రైమ్‌కథ	...	20
న్యాయ సలహాలు	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

స్పష్టత కలిగించిన 'నగరం'

విజ్ఞాన వీచిక... 10

ఎడిసన్ బల్బుకు వీడ్కోలు

తెలుసుకుందామా ... 18

నూరేళ్ల శ్రీశ్రీ...

కథ ... 22

పుట్టిన రోజు



తమాషా 'భౌ భౌ సఫారీ'

మూడోతరం కథ బావుంది. ఈ బడా కార్పొరేట్ సంస్థల వల్ల ఎంతమంది కుల వృత్తులవాళ్లు నిరాశ్రయులౌతున్నారో కదా. ఒకప్పుడు చేతినిండా సంవత్సరం పొడవునా పని వుండే వారికి ఇప్పుడు కడుపు నిండడమే గగనమౌతోంది. ఈ పరిస్థితి మారుతుందా? అనిపిస్తుంది. తమాషాగాలో భౌ భౌ సఫారీ నేటి చానెళ్లలో వస్తున్న కార్యక్రమాలను చూస్తున్నట్లుగానే తమాషాగా ఉంది. ఇలాంటివి ప్రతివారం ఇస్తే బావుంటుంది. ప్రమాణాలు చేసేముందు అవి నిలబెట్టుకుంటామా లేదా అని ఆలోచించి చేసే వారు ఈ కాలంలో ఎందరున్నారు?

నవ్యశ్రీ, రామ్ నగర్, హైదరాబాద్.

ఆశ్చర్యపరచిన బన్యన్ ట్రీ

ఈవారం విజ్ఞాన వీచిక లో వచ్చిన 'మూసుకోనున్న నింగినేత్రం' మాకు బాగా నచ్చింది. చూద్దామా శీర్షిలో కోల్‌కొతా బొటానికల్ గార్డెన్ గురించి తెలుసుకున్నాం. అదులోని గ్రేట్ బన్యన్ ట్రీ గురించి చదివి ఆశ్చర్యపోయాం. నీరుగారిపోతున్న ఆశలు కవిత బాగుంది. ఇక అట్టమీది కథ టిబెట్ గురించి, టిబెట్‌లో ఒకప్పటి పరిస్థితులను, ఇప్పటి పరిస్థితులను చదువుతుంటే నిజమేనా అనిపిస్తుంది. చాక్లెట్ ప్రపంచం నోరూరిస్తోంది.

బాలాజీ, లక్ష్మీనగర్, మెదక్.

'స్ఫూర్తి'దాయకం

సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, వైజ్ఞానిక అంశాల విశిష్ట సమ్మేళనం స్నేహ. స్నేహలోని ప్రతి శీర్షికా ఆసక్తికరంగా, ఆలోచన రేకెత్తించే విధంగా ఉంటోంది. ముఖ్యంగా నిరంతరం ప్రజా ఉద్యమాల్లో మమేకమై ఉండే కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తినిచ్చిన పుస్తకాలను పరిచయం చేస్తున్న శీర్షిక 'స్ఫూర్తి' అంటే మాకెంతో ఇష్టం. ప్రతివారం దాన్ని మిస్ కాకుండా చదువుతున్నాము. ఈవారం స్ఫూర్తిలో స్టీఫెన్ హాకింగ్ 'కాలం కథ' పుస్తకం గురించిన పరిచయం అద్భుతంగా ఉంది. ఏచదువు చదివినా, ఏ ఉద్యోగంలోఉన్నా ప్రతివారికి శాస్త్రీయ దృక్పథం చాలా అవసరం. "జీవ పరిణామాన్ని అధ్యయనం చేసి మనస్ఫూర్తిగా విశ్వసించిన జిజ్ఞాసువులెవరైనా వారు హేతువాదులౌతారు. మార్క్సిస్టులౌతారు. స్త్రీవాదులు, దళిత వాదులు చివరకు మానవతా వాదులౌతారు. ఎందుకంటే వాటన్నింటి మూలాలు జీవపరిణామంలోనే సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్నాయి" అన్న పంక్తులు అక్షర సత్యాలు.

ఆర్.డబ్ల్యు.జె.ఐ. కుమార్, పెద్దాపురం.

ఆశ్చర్యంతో పాటు నోరూరింది

మే 31 ఆదివారం స్నేహలో అట్టమీది కథ చాలా బాగుంది. మూడోతరం కథ మారుతున్న నాగరిక సమాజాన్ని, ప్రజల ఆధునిక పద్ధతులను తెలిపింది. కుల వృత్తులు పనికిరాకుండా పోయాయని చెప్పిన విషయం బాగుంది. చాక్లెట్ ప్రపంచంలో చాక్లెట్‌తో తయారైన వివిధ వస్తువులను చూస్తుంటే ఆశ్చర్యంతో పాటు నోరూరుతుంది. రుచిలో వివిధ రకాల పచ్చళ్ల గురించి తెలిపినందుకు ఎంతో ఆనందించాం. ఆదివారం అనుబంధం ఇలాగే అలరించాలని కోరుకుంటున్నాం.

పోలు స్వామి, సారంపల్లి.

ఉల్లిపాయ పచ్చడి బావుంది

ప్రపంచ పీఠభూమి టిబెట్ గురించి ఈ వారం అట్టమీది కథగా ఇచ్చారు. దలైలామాలు ముసుగు వేయబట్టే టిబెట్ వెనకబడి వుందనేది నిజం. కానీ చైనా ప్రగతి పథం ద్వారానే ఎదిగింది. వెలక్కాయ పచ్చడి, ఉల్లిపాయ పచ్చడి బాగుంది. చాక్లెట్ ప్రపంచం వింత అనుభూతినిచ్చింది. వెర్రి వెయ్యి విధాలన్నారు. అలాగే ఉంది ఈ చాక్లెట్ ప్రపంచం కూడా.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

టిబెట్ ప్రజల కష్టాలు తెలుసుకున్నాం

మే 31 ఆదివారం స్నేహ సంచిక చాలా బాగుంది.



అట్టమీది కథ ప్రపంచ పీఠభూమి ప్రగతి గీతి. బౌద్ధమతం విస్తృతంగా ఉన్న టిబెట్ గూర్చి, 1959కి పూర్వం లామాల చేతిలో టిబెట్ జనాభా పడ్డ కష్టాలను తెలుసుకున్నాం. టిబెట్‌లో వెనుకబాటుతనానికి, అరాచకత్వానికి కారణమైన లామాలు, ముఖ్యంగా దలైలామా యే ఇదంతా చేశాడంటే ఆశ్చర్యం కలిగింది. చైనా సహకారంతో ప్రజలు మత గురువులు దలైలామాలపై పోరాటం చేసి నవ టిబెట్‌ని నిర్మించుకోవడం హర్షదాయకం. ఇప్పుడు టిబెట్ ప్రజలు అభివృద్ధి చెందడం చాలా మంచి పరిణామం. దలైలామా వంటి మత గురువులను వారు చేసే అరాచకాలను అరికట్టాలి.

వి.ఎల్. స్వామి, కామారెడ్డి, నిజామాబాద్.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేదైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

అరటికాయ కూర

కావాల్సిన వస్తువులు

అరటికాయలు - 2, కొబ్బరి - అరచెక్క
ఉప్పు - చాలినంత, మినపప్పు - 1 టీ స్పూన్
జీలకర్ర - కొంచెం, పసుపు - కొంచెం
ఉల్లిపాయలు - 2, ఆవాలు - 1 టీ స్పూన్
నూనె - 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి - 4, ఎండుమిర్చి - 4

చేసే పద్ధతి

అరటికాయ చెక్కుతీసి చిన్న చిన్న ముక్కలుగా కోసి వుంచాలి. ఒక పాత్రలో నీళ్ళు పోసి అందులో అ ముక్కలను వుడకబెట్టాలి. ఉడుకుతున్నప్పుడే ఉప్పు, పసుపు వెయ్యాలి. నీళ్ళు ఎక్కువ కాకుండా వుడకడానికి సరిపడా మాత్రమే పొయ్యాలి. మూకుడు పొయ్యిమీద వుంచి అందులో నూనె పోసి బాగా మరిగించాలి. మినిప్పప్పు, పచ్చిమిరపకాయ ముక్కలు, తురిమిన ఎండుమిర్చి ఉల్లిపాయ ముక్కలు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించాలి. బాగా వేగిన తర్వాత వుడికిన అరటికాయ ముక్కలను వేసి తిరగమోత పెట్టాలి. వెంటనే మూత పెట్టేస్తే వాసన పోకుండా బావుంటుంది.

కంద పులుసు

కావాల్సిన వస్తువులు

కంద - పావుకిలో, చింతపండు - 50గ్రాములు
పచ్చిమిర్చి - 6, కారం - ఒక టీస్పూను
ఉల్లిపాయలు - 2, పసుపు - కొంచెం
కరివేపాకు - కొంచెం, ఉప్పు - చాలినంత
నూనె - ఒక టేబుల్ స్పూన్

చేసేపద్ధతి

కందను శుభ్రంగా కడిగి కొంచెం ఉప్పు వేసి ఉడికించాలి. వుడికిన తర్వాత తొక్కు వలిచి ముక్కలుగా కోయాలి. ఒక గిన్నెలో నూనె పోసి బాగా మరగించాలి. అందులో పచ్చిమిరపకాయ ముక్కలూ, కరివేపాకు వేసి బాగా వేయించాలి. అవి వేగిన తర్వాత కందముక్కలు వేసి మూతపెట్టి కాసేపు వుంచాలి. చింతపండు పిసికి చిక్కటి పులుసు తియ్యాలి. దీన్ని గిన్నెలో పొయ్యాలి. అందులోనే పసుపు, ఉప్పు, కారం వేసి మూత పెట్టి బాగా మరిగేవరకూ అలా వుడకనివ్వాలి. పులుసు చిక్కగా కావాలనుకునేవారు బాగా దగ్గరగా మరగనిచ్చి దింపెయ్యాలి





కంద పచ్చడి

కావాల్సిన వస్తువులు

కంద - పావు కిలో, పసుపు - చిటికెడు
ఉల్లిపాయలు - 2, ఉప్పు - తగినంత
మినపప్పు - 1 టీస్పూను, ఆవాలు - 1టీ స్పూను
జీలకర్ర - కొంచెం, చింతపండు - నిమ్మకాయంత
నిమ్మకాయ - 1, అల్లం - కొంచెం,
కరివేపాకు - 2 రెబ్బలు, నూనె - పావు కప్పు

చేసేపద్ధతి

కందను శుభ్రంగా కడిగి వుడకబెట్టాలి. వుడకబెట్టిన తర్వాత పై తొక్క తేలికగా ఊడివస్తుంది. ఉడికిన కందకు తొక్క తీసిపారేసి గుజ్జుగా చేసుకోవాలి. తర్వాత ఉప్పు, పసుపు, చింతపండు రసం కలపాలి. మూకుడులో నూనెపోసి బాగా మరిగిన తర్వాత మినపప్పు, ఎండు మిరపకాయలు, ఉల్లిపాయ ముక్కలు, ఆవాలు, జీలకర్ర, చితకకొట్టిన అల్లం, కరివేపాకు వేసి బాగా వేయించాలి. వేగినదాంట్లో పైన వుడకబెట్టిన కంద గుజ్జువేసి కలియబెట్టాలి. మూతపెట్టి కాసేపు వుంచితే బాగా మగ్గుతుంది. దించిన తర్వాత నిమ్మకాయ పిండితే చాలా రుచిగా వుంటుంది. కంద మాత్రం దురద లేనిది తీసుకోవడం మరచిపోకూడదు.

కందకూర

కావాల్సిన వస్తువులు

కంద - పావు కిలో, ఉప్పు - చాలినంత
మినపప్పు - 1 టీ స్పూన్, సెనగపప్పు -1 టీస్పూన్
ఆవాలు - కొంచెం, కరివేపాకు - కొంచెం
ఎండు మిర్చి - 6, పచ్చిమిర్చి - 6
నూనె - 1 టేబుల్ స్పూన్, చింతపండు - కొంచెం

చేసేపద్ధతి

కందను శుభ్రంగా కడగాలి. ఒక పాత్రలో కందముక్క వుంచి.. అది మునిగేటట్లు నీళ్ళుపోయాలి. అందులో ఉప్పు వేసి బాగా వుడికించాలి. వుడికిన తర్వాత చెక్కు తీసెయ్యాలి. కందని మెత్తగా దంచాలి. అందులోనే పచ్చిమిరపకాయలు, కొద్దిగా చింతపండు వేసి మెత్తగా తొక్కాలి. ఒక మూకుడులో నూనె పోసి బాగా మరగనివ్వాలి. అందులో సెనగపప్పు, మినపప్పు, ఎండు మిరపకాయ ముక్కలు, ఆవాలు, కరివేపాకు వేసి బాగా వేయించాలి. అందులో కందముద్ద వేసి అవసరమయితే కొంచెం ఉప్పు కూడా కలిపి కలదిప్పాలి.



- కె. కేశవరెడ్డి
ఐక్య ఉపాధ్యాయ మాజీ సంపాదకులు

స్పష్టత కల్పించిన 'నగరం'

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిన్న పుస్తకం సమాజం యొక్క విశ్వరూపాన్ని సందర్శింపజేసింది. సాహిత్యంపై సామాజిక సమస్యలపై అస్తవ్యస్తంగా కలగాపులగంగా వున్న నా ఆలోచనలకు స్పష్టత కల్పించింది. వర్గదృక్పథంతో చూడగలిగే పరిజ్ఞానాన్ని అందించి దిశా నిర్దేశం చేసింది. శ్రామికవర్గ పక్షపాతంగా నిలబెట్టింది. సాహిత్యం సంస్కృతి చరిత్ర ఆర్థిక రాజకీయ శాస్త్ర గ్రంథాల్ని అధ్యయనం చేయించింది.



నాకు చిన్నప్పటి నుండి సాహిత్యం పట్ల ఆసక్తి ఎక్కువ. పొందికగా చెప్పబడిన ప్రతి విషయమూ నన్ను ఆకట్టుకునేది. 'మను చరిత్ర, పారిజాతాపహరణం' లాంటి ప్రబంధాలు చదివాను. అప్పటి గ్రంథాలయాల్లో లభ్యమయ్యే కథలు, నవలలు విరివిగా చదివాను. శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాలు ముగ్ధుణ్ణి చేశాయి. కృష్ణశాస్త్రి, వేదుల పద్యాలు ఊహాలోకాల్లో విహరింపజేశాయి. సామాజికంగా అందరూ బతకడానికి వీలయ్యే సోషలిజాన్ని ఆకాంక్షించేవాణ్ణి. అది శాంతియుతంగా సాధించడానికి వీలయితే అంతకంటే కావలసిందేముంది? అనుకునేవాణ్ణి. ఎవరేం చెప్పినా, రాసినా అందరూ కోరేది విశ్వశ్రేయస్సేనని నమ్మేవాణ్ణి. దారులు వేరైనా గమ్యం ఒకటే అనుకొనేవాణ్ణి. ఈ దశలో గోర్కీ రచన 'ది సిటీ ఆఫ్ ది ఎల్లో డెవిల్' (నగరం) చదివాను. వంద పేజీల ఈ చిన్న పుస్తకం సాహిత్యం పట్ల, సమాజం పట్ల అస్తవ్యస్తంగా కలగాపులగంగా వున్న నా ఆలోచనలకు స్పష్టత కల్పించింది. అనునిత్యం ప్రజలు అనే పదాన్ని జపిస్తూ ప్రజలనుద్ధరించడానికి కంకణం కట్టుకున్నామని చెప్పుకొనే పాలకవర్గ రాజకీయవేత్తల దృష్టిలో ప్రజలెవరో, వారేప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి తహతహలాడుతున్నారో స్పష్టం చేసింది. పాలకవర్గ ప్రలోభాలకు లొంగిపోతూ వీరి ప్రయోజనాలకు ఊడిగం చేస్తూ కూడా తమ జీవనవిధానాల్ని తామే మలచుకొంటున్నామనే దయనీయమైన అహంభావంతో వున్న ప్రజల స్వేచ్ఛ -వడ్రంగి చేతిలోని రంపానికున్న స్వేచ్ఛ, కమ్మరి చేతిలోని సమ్మెటకున్న స్వేచ్ఛయని తెలియజేసింది. అంతేగాదు. పాలకవర్గాలకు సాధారణంగా సాహిత్యం, కళలు సైన్స్ సామాజిక శాస్త్రాల పట్ల గల అభిప్రాయాల్ని, వాటి నుండి వారేం ఆశిస్తారో విశదం చేసింది. పాలనాయంత్రాంగాన్ని సజావుగా రాపిడి లేకుండా నడపడానికి మతాన్ని కందెనగా వాడుకుంటుందని చెప్పింది.

బూర్జువా సంస్కృతిని నగ్నంగా కళ్లకు కట్టింది. గోర్కీ మాటల్లోనే... "కష్టించి పనిచేసే అధిక సంఖ్యాకులైన కూలీలు, రైతులు పొట్ట కూటికై ధనస్వామ్యానికి ఊడిగం చేసే ఉద్యోగులు -యిత్యాది కార్మికవర్గంపై పరాన్నభుక్కులైన అల్ప సంఖ్యాక వర్గానికి విస్తృతమైన అధికారాలను సంక్రమింపజేసి, వారి ఆస్తుల్ని పదిలంగా కాపాడుతూ అవి న్యాయసమ్మతమైనవిగా వివిధ సంస్థలతో ప్రసారసాధనాలతో ప్రచారం సాగించడమే బూర్జువా సంస్కృతి. బూర్జువా సంస్కృతిలో పాఠశాలలుంటాయి. అక్కడ అసత్యాలు చెప్పబడతాయి. దేవాలయాలు, చర్చీలు వుంటాయి. అక్కడ అసత్యాలు చెప్పబడతాయి.

పార్లమెంటులుంటాయి. అక్కడా అబద్ధాలే చెప్పబడతాయి. పత్రికలు ఇతర ప్రసార సాధనాలుంటాయి. అవి అసత్యాల కట్టుకథలల్లి ప్రచారం చేస్తుంటాయి".

ఎన్నో కష్ట నిష్ఠూరాల కోర్చి సౌందర్యమయం సౌభాగ్యవంతంగా మలచుకొన్న ఈ భూగోళం మొత్తం డబ్బు పోగుచేసుకొనడం తప్ప మరేపనీ చేయలేని కొద్దిమంది దురాశాపరుల విషదష్ట్రలలో చిక్కుకొనడం, అలాగే కార్మికులు - శాస్త్రవేత్తలు - సాంకేతిక నిపుణులు - కవుల శారీరక మానసిక శక్తుల కృషి ఫలితంగా మనం నిర్మించుకొన్న రెండవ ప్రకృతియైన ఈ సంస్కృతిని కొద్దిమంది దురాశాపరులు బంగారపు ముక్కలుగా, బ్యాంకు చెక్కులుగా మార్చుకొనగలగడం ఎంత బాధాకరంగా జుగుప్సాకరంగా వుంటుందో ఆలోచింపజేసింది ఈ పుస్తకం.

రాజకీయాధికారం కార్మికుల హస్తగతమైనప్పుడు మాత్రమే నిజమైన నాగరికత, పురోగామి దృక్పథంగల సంస్కృతి అభివృద్ధి చెందడానికి అవకాశాలుంటాయి గాని ఇతరుల శ్రమశక్తిపై ఆధారపడే పరాన్నభుక్కుల చేతుల్లో వున్నప్పుడు కాదని స్పష్టంచేసింది. ఆకలి నాగరికతకు పునాది అని తెలియజేసింది.

పత్రికా రచయితలు సంపాదకుల మీద, సంపాదకులు ఆయా పత్రికాధిపతులైన పారిశ్రామికవేత్తల మీద బ్యాంకర్ల మీద ఆధారపడి పని చేస్తున్నప్పటికీ, మేధాపరమైన స్వాతంత్ర్యాన్ని కలిగివున్నామనే అపోహలో వున్న పత్రికా రచయితలు వున్నారు. తమ రచనల ద్వారా సమాజంలోని అజ్ఞానం అనే చీకటిని చీల్చి చెండాడుతున్నామనే భ్రమలో వున్న బూర్జువా పత్రికారచయితలు తమ తమ రంగుటద్దాల్ని తొలగించి, కళ్ళు తెరిచి మనసు విప్పి సమాజాన్ని తేరిపారజూస్తే, పెట్టుబడిదారీ సమాజం ఏ సూత్రాలపై నడుస్తున్నదీ, తాము కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి ఇసుక ప్రవాహాలపై నిర్మించబడిన ఆర్థిక సామాజిక శాస్త్రాల్ని అధ్యయనం చేసిందీ వారు ఎలాంటి విషవలయాల్లో చిక్కుకొని ఎవరికి సేవలు చేస్తున్నదీ తేటతెల్లం చేసింది. ప్రజలు పత్రికా రచయితలతో సహా సంతలో గొర్రెల్లా అమ్ముడుపోయే సరుకులుగా చూపబడుతున్న పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తి స్వేచ్ఛను గురించి కలలు కనడం మాట్లాడడం హాస్యాస్పదమని, పరాధీనపు బతుకులు బతుకుతున్న బూర్జువా రచయితలు సంస్కృతీ నిర్మాతలమనుకోవడం మరీ హాస్యాస్పదమని స్పష్టం చేసింది.

పాలకవర్గాలు చేసే పెద్ద పెద్ద దోపిడీలపై ప్రజల దృష్టి పడకుండా చేసేందుకు కిరాయి మనుషుల్ని పెట్టి చిన్న చిన్న అలజడులు సృష్టించి, వీటికి విపరీతమైన ప్రచారం ఇవ్వడం పాలకవర్గాలు అవలంభించే ఒక టెక్నిక్. ముష్టివాడు మిఠాయి వుండని తస్కరించడం గమనించి పక్కవాడి జేబులో పర్సు కాజేసేయ్. దొంగ దొంగ అని కేకలేసేయ్. జనం దృష్టి ముష్టివాడిపై పడుతుంది. బ్రిడ్జిపై కిరాయి జనాన్ని పెట్టి రాళ్లు పైకి విసిరించు. ప్రజల దృష్టి రాళ్ళపై వుంటుంది. నదీ ప్రవాహంలో కొయ్యదూలాల్ని తరలించు. వల విసిరి చిన్న చేపల్ని (దిగువస్థాయి పాతికా పరకా లంచగొండుల్ని) పట్టుకొని టీవీలలో ఇన్‌సెట్లో హుటాహుటిన చూపించేలా చేయ్. పై స్థాయిలో వందల వేల కోట్లు చేతులు మారడం ప్రజలు గమనించరు.

అల్పసంఖ్యాక వర్గాలు అధికసంఖ్యాక వర్గాల్ని నిస్సంకోచంగా నిస్సిగ్గుగా దోచుకొనే హక్కు కొరకు యుద్ధాలు చేస్తాయని, ఏయే గుత్తపెట్టుబడిదారీ సంస్థలు వాటి గ్రూపులు ఏయే దేశాలపై ఆధిపత్యం సాధించాలో తేల్చుకొనేందుకు సామ్రాజ్యవాదం యుద్ధాలు కొని తెస్తుందని స్పష్టంచేసింది. శ్రమశక్తితో ఉత్పత్తి అయిన వస్తువులు శ్రామికులకు చెందాలిగాని వాటిని తయారుచేయమని ఆజ్ఞాపించిన వారికి కాదనేది అతి సాధారణమైన స్పష్టమైన మానవతా వాదంతో కూడిన న్యాయమని వివరించింది.

దోపిడి సాగిస్తూ అలసి పోయిన వారికి, వారి అమానుష కృత్యాలతో పాటు పదునెక్కుతున్న కార్మికవర్గ చైతన్యాన్ని చూచి కలవరపడిపోయే వారికి, డబ్బు పోగుచేసుకొనే పేరాశతో సంఘ విద్రోహ చర్యలకు పాల్పడేవారికి సాంత్వనములు పలుకుతూ, వారిని అలరించేందుకు మేధావులు ధరించే విదూషకపాత్రలు ప్రయోజన రహితాలే గాక తమకు (మేధావులకు) ప్రమాదాల్ని తెచ్చిపెట్టేవని మేధావులు గ్రహించాలని హితవు చెప్పింది. ఆలోచనా విధానంలో బూర్జువా వర్గానికి, సామాజిక స్థాయిలో కార్మికవర్గానికి సన్నిహితంగా వుండే బూర్జువా మేధావులు, తమ సేవల అవసరాల్ని అంతంత మాత్రంగా గుర్తిస్తున్న బూర్జువా పక్షం వహించడమా! లేక ఆత్మగౌరవం ప్రబోధిస్తున్న విధంగా బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రామికుల పక్షం వహించడమా? అనేది తేల్చుకోవలసిన సమయమాసన్నమయిందని హెచ్చరించింది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిన్న పుస్తకం సమాజం యొక్క విశ్వరూపాన్ని సందర్శింపజేసింది. సాహిత్యంపై సామాజిక సమస్యలపై అస్తవ్యస్తంగా కలగాపులగంగా వున్న నా ఆలోచనలకు స్పష్టత కల్పించింది. వర్గదృక్పథంతో చూడగలిగే పరిజ్ఞానాన్ని అందించి దిశా నిర్దేశం చేసింది. శ్రామికవర్గ పక్షపాతంగా నిలబెట్టింది. సాహిత్యం సంస్కృతి చరిత్ర ఆర్థిక రాజకీయ శాస్త్ర గ్రంథాల్ని అధ్యయనం చేయించింది.

★

శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాలు ముగ్ధుణ్ణి చేశాయి. కృష్ణశాస్త్రి, వేదుల పద్యాలు ఊహాలోకాల్లో విహరింపజేశాయి. సామాజికంగా అందరూ బతకడానికి వీలయ్యే సోషలిజాన్ని ఆకాంక్షించేవాణ్ణి. అది శాంతియుతంగా సాధించడానికి వీలయితే అంతకంటే కావలసిందేముంది? అనుకునేవాణ్ణి. ఎవరేం చెప్పినా, రాసినా అందరూ కోరేది విశ్వశ్రేయస్సేనని నమ్మేవాణ్ణి. దారులు వేరైనా గమ్యం ఒకటే అనుకొనేవాణ్ణి. ఈ దశలో గోర్కీ రచన 'ది సిటీ ఆఫ్ ది ఎల్లో డెవిల్' (నగరం) చదివాను. వంద పేజీల ఈ చిన్న పుస్తకం సాహిత్యం పట్ల, సమాజం పట్ల అస్తవ్యస్తంగా కలగాపులగంగా వున్న నా ఆలోచనలకు స్పష్టత కల్పించింది. అనునిత్యం ప్రజలు అనే పదాన్ని జపిస్తూ ప్రజలనుద్ధరించడానికి కంకణం కట్టుకున్నామని చెప్పకొనే పాలకవర్గ రాజకీయవేత్తల దృష్టిలో ప్రజలెవరో, వారేప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి తహతహలాడుతున్నారో స్పష్టం చేసింది.

ఆరోగ్యం

సాధారణంగా జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలొచ్చినప్పుడు సరాసరి డాక్టర్ దగ్గరకు వెళ్లడం మనకు అలవాటు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సమాచారం లేకుండా డాక్టర్ దగ్గరికి వెళ్తే ఆయన సర్జరీ చేసేందుకు సమాయత్తం అవుతుండొచ్చు, లేదా ఇతర పనుల్లో బిజీగా ఉండొచ్చు. అలాంటప్పుడు సరిగా పరీక్షించే అవకాశం ఉండదు. దీంతో మన సమయం వృథా అవుతుంది. ఫలితం ఉండదు. అందుకని డాక్టర్ దగ్గరికి వెళ్లే ముందు కొన్ని విషయాలు తెలుసుకుని వెళ్తే ఇక ఎలాంటి ఇబ్బందీ ఉండదు. డాక్టర్ దగ్గరికి వెళ్లబోయే ముందు ఏ డాక్టర్ ఎక్కడ ఉంటారు? ఏ సమయంలో చూస్తారు, ఏఏ రిపోర్టులు తీసుకెళ్లాలి? ఎలా వెళ్లాలి? మొదలైన అంశాలు తెలుసుకుందామా...

డాక్టర్ దగ్గరకెళ్తున్నారా!

మన ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం అంటే ప్రిస్క్రిప్షన్లు, వాడిన మందుల చీటీలు, ఏవైనా పరీక్షలు చేయించుకుంటే వాటి రిపోర్టులతో ఒక ఫైల్ తయారుచేయాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే అన్ని ఫైల్సు విడిగా చేయడం మంచిది. అలా అన్నీ సిద్ధంగా వుంటే అవసరమైనప్పుడు వెతికే అవసరం ఉండదు. అనారోగ్యానికి గురైన తేదీలను రాసిపెట్టుకోవాలి. దీంతో డాక్టర్ పరిశీలించే సమయం వృథా కాదు.

అపాయింట్‌మెంట్

ముందుగా ఆసుపత్రికి ఫోన్ చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. మనకు కేటాయించిన సమయానికే వెళ్లాలి. ఆ సమయానికి ముందో వెనకో వెళ్లి మిమ్మల్ని చూడమని ఒత్తిడి చేయకూడదు. ఇంట్లో ఎవరికైనా జబ్బు చేస్తే అందరూ బాధపడడం సహజం. అలాగని జబ్బుపడ్డవారితో కుటుంబసమేతంగా ఆసుపత్రికి వెళ్లడం పద్ధతి కాదు. రోగికి సహాయకులుగా జీవితభాగస్వామి లేదా సన్నిహితులు వెళ్లాలి. మరీ ఎక్కువమంది డాక్టర్ రూమ్‌లోకి వెళ్తే గది అంతా కిక్కిరిసి డాక్టర్‌కు చిరాకుగా ఉంటుంది. రోగి తన సమస్యను సరిగా చెప్పలేడు. అంతేకాక డాక్టర్ ఏకాగ్రత దెబ్బతిని విషయాన్ని సరిగా చెప్పలేకపోవచ్చు. పిల్లలకు జబ్బు చేస్తేకానీ ఆసుపత్రికి తీసుకెళ్లకూడదు. ఎందుకంటే పిల్లలకు రోగనిరోధక శక్తి తక్కువ. దీంతో ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఎక్కువ. ఒక రోగిని పరీక్షించడానికి డాక్టర్ 15 నుంచి 20 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఈ సమయాన్ని రోగి సాధ్యమైనంతవరకు ఉపయోగించుకోవాలి.

రోగికే ప్రాధాన్యత

డాక్టర్లు రోగి ద్వారానే సమస్యను వినాలనుకుంటారు. ఒక్కోసారి రోగి సరిగా చెప్పలేదని సహాయకులకు అనిపించవచ్చు. కానీ వీరికి పరిస్థితిని వివరించాలనే ఉత్సాహం ఉంటుంది. దీన్ని అదుపు చేసుకోవాలి. రోగి చెప్పడం పూర్తయ్యాక ఇంకా ఏవైనా చెప్పని విషయాలుంటేనే చెప్పాలి. అంతేకానీ మళ్లీ మొదటినుంచి ఏకరువు పెడితే డాక్టర్‌కు విసుగొస్తుంది. ఒకవేళ రోగి తాను అన్ని విషయాలూ గుర్తుంచుకుని చెప్పలేనేమోనని అనుకుంటే ఒక కాగితంపై రాసి తీసికెళ్లడం మంచిది.

రిపోర్టు మరవద్దు

డాక్టర్ దగ్గరికి వెళ్లేముందు గతంలో చేయించుకున్న చికిత్స వివరాలు, పరీక్షల రిపోర్టులను (రక్తపరీక్ష, బిపి, మూత్రపరీక్ష, ఎక్స్-రే వంటివి) తీసుకెళ్లడం మరవద్దు. రిపోర్టులను తేదీలవారీగా వరుసగా పెట్టాలి. తమకు మధుమేహం, రక్తపోటు, ఆస్తమా ఉంటే తప్పకుండా చెప్పాలి. దీంతో చికిత్స సులభమవుతుంది.

డాక్టర్‌ను మాట్లాడనివ్వాలి

రోగి చెప్పింది విని, రిపోర్టులు చూశాక డాక్టర్ తన అభిప్రాయాన్ని, చికిత్స గురించి చెబుతారు. ఇది వినడం చాలా ముఖ్యం. మధ్యలో అడ్డుపడి సమస్యలను ఏకరువు పెట్టకూడదు. డాక్టర్ చెప్పింది పూర్తయ్యాక ఇంకా ఏవైనా సందేహాలున్నాయనిపిస్తే అప్పుడు చెప్పాలి. వ్యాధిపై ఇంకా అనుమానాలుంటే మళ్లీ అడిగి నివృత్తి చేసుకోవాలి. డాక్టర్‌ను కలిశాక వెళ్లేముందు కృతజ్ఞతలు చెప్పడం మరవకూడదు.

ఆసుపత్రిలో చేరాక ...

ఆసుపత్రిలో పన్నెండేళ్ల లోపు పిల్లలను ఇన్‌పేషెంట్ రూమ్‌లోకి అనుమతించరు. ఎందుకంటే ఆసుపత్రిలోని రోగుల ఇన్‌ఫెక్షన్లు పిల్లలకు సోకే అవకాశం ఎక్కువ. రోగి సహాయకుల శ్రేయస్సుకోరే ఈ నిబంధన విధించారు. దీన్ని అర్థం చేసుకుని ఆసుపత్రి వర్గాలకు సహకరించాలి. శస్త్ర చికిత్స అయ్యాక రోగిని రెండు నుంచి మూడు రోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి మార్చుతారు. బయటి నుంచి రోగిని చూడటమే మంచిది. కారణం బయటి నుంచి వచ్చిన మనలో ఎన్నో ఇన్‌ఫెక్షన్లు ఉంటాయి. లోపలికి వెళ్తే మన ఇన్‌ఫెక్షన్లు రోగికి సోకి వ్యాధి తీవ్రత పెరగొచ్చు. లేక రోగి ఇన్‌ఫెక్షన్లు మనకూ వ్యాపించవచ్చు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే రెండు నిమిషాల కన్నా ఎక్కువ ఉండకూడదు. రోగితో ఆందోళన కలిగించే విషయాలేవీ (ఇంటి సమస్యలు, ఆసుపత్రి బిల్లులు ఇతరాలు) ప్రస్తావించకూడదు. మన మాటలు రోగికి ఆత్మస్థైర్యం కలిగించేలా ఉండాలి. సంయమనంతో ఆసుపత్రి నిర్వాహకులకు సహకరించాలి.

కొన్ని సందర్భాల్లో అత్యవసర కేసులు వస్తే డాక్టర్ మధ్యలో వెళ్లాల్సి ఉంటుంది. దీన్ని అశ్రద్ధగా భావించకూడదు. మిగతా రోగులు కూడా మనలాంటి వారేనని గమనించాలి. ఓపిక, సహనం ముఖ్యం. గదిలోకి వెళ్లేముందు సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేయడం మరవకూడదు. డాక్టర్‌ను కలిసిన తర్వాత ఒకవేళ అత్యవసర పరిస్థితి కలిగితే ఫోన్‌లో అందుబాటులో ఉంటారేమో కనుక్కుని ఆ ఫోన్ నంబర్ తీసుకోవాలి.

★

యు.సత్యనారాయణ,
పేషెంట్ రిలేషన్ ఆఫీసర్,
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ.
హైదరాబాద్.
ఫోన్ : 98490 45567

చూద్దామా

బీదర్



నీలంగా నుంచి బీదర్‌కు బయలుదేరితే ప్రకృతి అందాలు పరవశింపచేస్తాయి. బాల్కి దాటిన తరువాత పరచుకున్న పీఠభూమి అందాలు, అక్కడక్కడ చిక్కని అరణ్యాలగుండా వెళుతూ ఆ ప్రకృతి సోయగాలు తనివితీరా అనుభవించొచ్చు. ఒకనాటి సుల్తానుల రాజ్యం. బహమనీ సుల్తానులలో ఒకరు బీజపూర్ సుల్తాన్ అహమ్మద్ షావలీ బహుమనీ 15వ శతాబ్దంలో నిర్మించిన కోట కొంత శిథిలమైనా ఇంకా నిలిచిఉంది. ఇటీవలవరకూ ఈ పట్టణాన్ని మహమ్మదాబాద్ బీదర్ అనేవారట. కొత్తగా వెలసిన కాలనీలు తప్ప పాత ఊరంతా కోటలోనే ఉంది. ఏడు ప్రాకారాలతో చుట్టూ అగడ్తతో విస్తారమైన నిర్మాణం ఇది. లోపల తఖ్తమహల్, తరఖ్ మహల్ లాంటివే కాక రంగీన్ మహల్, షాహీమహల్ అను సుల్తాన్ వారి అంతఃపురం, వారి నివాసాలు, స్నానశాలలూ, దివానీ ఆమ్ లాంటి సభాగృహం ఆనాటి రాచరిక వైభవానికి చిహ్నాలుగా మిగిలాయి. ఇక్కడో మదర్సా కూడా ఉంది.

బీదర్ హస్తకళలకు ప్రసిద్ధి. ఈ దుకాణాలన్నీ కోటలోనే ఉన్నాయి. ఒక దుకాణంలో తీరుబడిగా కూర్చుని అన్ని విషయాలూ గమనిస్తూ విశేషాలు తెలుసుకున్నాము. గన్‌మెటల్ బొమ్మలు చేసి, నల్లగా పాలిష్ చేసి దానిమీద వెండితీగతో కళ్లు చెదిరే నగిషీలు మలచి ఈ నలుపు తెలుపు సమ్మేళనంతో అద్భుతమైన కళాసృష్టి చేస్తారు. ఇది బీదర్‌కే ప్రత్యేకం. అబ్దుల్లా బీన్ కైజర్ అనే కళాకారుడు ఈ కళకు మూలపురుషుడంటారు. ఈయన పర్షియానుంచి ఈ బీదర్‌కోట నిర్మాణానికి వస్తూ తన వెంట పర్షియా, ఇరాన్ నుంచి కొందరు శిల్పులను హిందూస్థాన్‌కు తీసుకు వచ్చాడట. ఈయన జింకు లోహాల మిశ్రమాలలో, వెండి బంగారు తాపడంలో అందెవేసిన చేయి. ఇతడు స్థానికంగా ఈ పనులలో నిష్ణాతులైన విశ్వబ్రాహ్మణులతో కలిసి ఈ బిద్రీ కళారూపాలకు ఆద్యుడైనాడు. ఈ కళాసృష్టికి సుల్తాన్ కూడా ముగ్ధుడై తన సహకారాన్నందించాడు. ఈ విద్యను వ్యాపింపజేయడానికి ఒక కళాకేంద్రాన్ని కూడా మహమ్మద్ గవాన్ అనే ఆయన స్థాపించాడు. ఆనాడు హుక్కా తాగడం దర్పానికి చిహ్నం గనుక హుక్కా సామాగ్రి ఈ పద్ధతిలో కళాత్మకంగా మలిచేవారు. అలాగే పాన్‌డబ్బాలు, ఉమ్మిపాత్రలు, ఇలా ఐశ్వర్యవంతులు నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువులు తయారుచేసినా, రానురాను సామాన్యులు వాడే వస్తువులు కూడా కళారూపాలను సంతరించుకున్నాయి. ఇప్పటికీ ఈ ప్రాంతంలో ముస్లిం వివాహాల్లో కట్నకానుకల సముదాయంలో ఈ బిద్రీ సామాగ్రి పుష్కలంగా ఉండవలసిందే. ఇవి ఎలా తయారుచేస్తారో తెలుసుకోకుండా ఉండలేం. జింకు, రాగి 16:1 నిష్పత్తిలో కలిపి వేడిచేసి, అవి ద్రవరూపంలోకి రాగానే అచ్చులో పోస్తారు. ఇవి ఘనీభవించిన తరువాత నున్నగా పాలిష్‌చేసి, దానిమీద ఉలితో, ఎంచుకున్న అలంకరణ సన్నని, గాడిగా చెక్కి, దీనిలో వెండి తీగ తాపడం చేసి, మళ్లీ నున్నగా పాలిష్‌చేసి, ద్రావకాలలో (సాల్ట్ పీటర్, అమ్మోనియం క్లోరైడ్) బాగా కడుగుతారు. ఈ రసాయనిక చర్యవల్ల 16 పాళ్లున్న జింక్ నల్లగా మారుతుంది. వెండి తళతళ మెరుస్తుంది. ఈ తాపడం చేయడంలో కూడా ఐదారు పద్ధతులున్నాయి. ఇప్పుడు వెండి తాపటం చేయడంలో కళాత్మక హృదయంతోపాటు, ఎంతో శ్రమ, సమయం కావాలి. ఇంతటి శ్రమకు లభించేది చాలా స్వల్పమే. ఇక్కడున్న 20-25 కార్ఖానాల్లో మనం చూచే కళావిశిష్టతకూ, ఆకళాకారుని పేదరికానికి ఉన్న అగాధం చూస్తే మనస్సు ద్రవించకమానదు. ప్రభుత్వం కొంత చేయూతనిస్తే అతడు తన కళాపరిధిని పెంచుకుంటూ, సౌందర్యపు లోతుల్ని స్పృశిస్తూ ఈ అపురూపకళను మరింత పరిపుష్టం చేయగలడు. కొనకూడదనుకుంటూనే చాలా బొమ్మలు కొనేస్తుంటారు పర్యాటకులు.

బీదర్‌లో ఒక వాయు సేనా శిక్షణ కేంద్రం ఉన్నది. ఈ కంటోన్మెంట్‌కు దాపులోనే సిక్కుల గురుద్వారా చాలా పెద్దది ఉన్నది. దీనిలో విశిష్టత ఉంది. గురునానక్‌దేవ్ దక్షిణ దేశయాత్రకు వచ్చి ఈ ఊరి బయట కొండలమీద ప్రార్థనలు, భజనలు జరిపిస్తున్నాడట. ఈ ప్రాంతపు ప్రజలు తాము తాగేందుకు నీరు లేక చాలా బాధపడుతున్నామని మొరపెట్టుకుంటే ఆ మహాపురుషుడు లేచి నిలుచుని, ఆ పర్వతాన్ని తన పాదంతో తాడించాడట. అక్కడి నుండి స్వచ్ఛమైన నీరు ప్రవహించడం మొదలైంది. ఇప్పటికీ వేసవిలో కూడా ఈ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. దీన్ని నానక్‌ఝరీ అంటారు. ఈ నీరు కిందికి ప్రవహించి ఒక సరస్సుగా ఏర్పడింది. దీనిని అమృతకుండ్ కొంటారు. కొండనుండి నీరు వచ్చేచోట పాలరాతి పాదం అమర్చి దానికో చిన్న మందిరం నిర్మించారు. దీనికి పక్కనే చాలాపెద్ద గురుద్వారా నిర్మించారు. ఇది సిక్కులకు చాలా పవిత్రమైన స్థలం. ఎక్కడెక్కడినుంచో సకుటుంబంగా దర్శనానికి వస్తుంటారు. అందుకే ఇక్కడ ముమ్మరంగా వసతి సౌకర్యాలు, లైబ్రరీ, మ్యూజియం, ఆసుపత్రి కూడా ఏర్పరిచారు.

ఊరుదాటి అవతలకు వెళితే ఝరీనారసింహ గుహ ఉంది. ఇది సుమారు నాలుగు అడుగుల, వెడల్పు, 300 అడుగుల పొడవు వుంటుంది. గుహ అంతా నాలుగు అడుగుల లోతు నీరుంది. ఆ లోపల నారసింహుని పూజావేదిక ఉంది. లైట్లున్నాయి. కనుక లోపల చీకటి లేదు. దీనికో కథ ఉంది. ఈ గుహలో ఝరాసురుడనే రాక్షసుడేండేవాడట. నృసింహావతారంలో హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని కాపాడి, అ రాక్షసుని సంహరించడానికి స్వామి ఇక్కడకు వచ్చాడట. ఆ ఉగ్రమూర్తిని చూచి భయపడి ఆ రాక్షసుడు శరణువేడి, వారిని ఇక్కడ నివసించమని కోరాడట. వాడి కోరికను మన్నించి స్వామి ఇక్కడ వెలిశాడని స్థలపురాణం. నీటి తడి, గుహలో గబ్బిలాల వాసన సహించి లోనికి వెళ్లిన తరువాత స్వామి దర్శనం కన్నులవిందు చేస్తుంది. ★



సీరియల్

గని

జరిగినకథ:

గనిలో జరిగిన దుర్ఘటనలో మరణించిన ఇద్దరిలో ఒకరి భార్య పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటుంది. అది కార్మికుల్లో తీవ్ర చర్చకు తెరతీస్తుంది. ఉద్యోగాన్ని ఎరగా చూపించి తమ శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాన్ని నిలదీయలేని దైన్యం వారిది. అసంతృప్తితో కుతకుతలాడిపోతున్న కార్మికులు బికాస్‌ను కలిసి పరిష్కారం చూపించమని కోరతారు. అతని సూచన మేరకు రహస్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి వినతిపత్రం పంపుతారు. అతను యాజమాన్యం గుప్పిట్లోని మనిషని వారికి తెలియదు.యాజమాన్యమూ, కార్మికులూ కుదుర్చుకున్న ఒప్పందం అమల్లోకి వస్తుంది. కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచినా తర్వాత్తర్వాత విసుగు మొదలౌతుంది. దయాదాక్షిణ్యాలు లేని అధికారుల ప్రవర్తనా, పరుషవాక్యాలూ వారిని బాధించడం మొదలౌతుంది. అందులోంచే ఆగ్రహం...ఆవేశం పుడుతుంది. కార్మికులంతా కలిసి పరిపాలనా భవనం ముందు గుమిగూడతారు. అయితే ఒప్పందపత్రంలో రాసుకున్న అంశాలను ప్రస్తావిస్తారు. దాంతో తాము మోసపోయామని కార్మికులు గుర్తిస్తారు. ఒక్కొక్కరు తమలోని అసంతృప్తిని బయటికి కక్కేస్తుంటారు. అప్పుడే బికాస్ పైకి లేచి తమకు సరైన జీతం ఇవ్వాలని, వైద్య ఖర్చుల్ని యాజమాన్యం భరించాలని, కార్మికసంఘం పెట్టుకునే హక్కు కల్పించాలని... బిగ్గరగా అరుస్తాడు. దాంతో యాజమాన్యం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది.

ఆ తర్వాత....

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పదకొండవ భాగం)

గని పోలీసు అధికారికి చెందింది కదా! క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోవడం వాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. ఎప్పుడూ సిద్ధంగా ఉండే గూండాలు రంగంలోకి దిగారు. నిరాయుధులైన కార్మికుల్ని చితకబాదారు. రెక్కలు తెగిన కోడికాళ్ళను పట్టుకొని విసిరేసినట్టు, గాయపడిన కార్మికుల్ని విసిరికొట్టారు. బికాస్‌చౌదరిని అదే పనిగా చావగొట్టారు. అతడి తల పగిలి, నెత్తుటి మడుగులో పడి ఉన్నాడు. స్పృహ కోల్పోయి, అతడు అచేతనంగా ఉండడం చూసి, చనిపోయాడని భావించి వెళ్ళిపోయారు గూండాలు.

మైదానం కళావిహీనంగా ఉంది. చినిగిన గుడ్డలూ, చెదిరిన చెప్పులు గాయపడిన కుందేళ్ళలా మూలుగుతొన్న మానవదేహాలు. కార్మికులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోయారు. కొందరు శాపనార్థాలు పెడుతుంటే, మరికొందరు సంకల్పబలం గురించి వివరిస్తున్నారు.

"కలోగంజో తాగి బతికుండే వాళ్ళం. ఇప్పుడు దానికి కూడా ఎసరుపెట్టారు. యజమానుల ఉంపుడుగత్తెల గురించి, ఖరీదైన కుక్కల గురించీ వ్యాఖ్యానాలు చేస్తే ఊరుకుంటారా? అబ్బ! ఎంత బలంగా తగిలిందీ దెబ్బ! జన్మజన్మలకూ మరిచిపోలేనంత నొప్పి!" అని కొందరు వాపోతున్నారు. రేపు సైరన్ కూత



వినిపించేసరికల్లా క్యాప్‌ల్యాండ్ గదిలో ఉండాలి. మనం ఎవరికి వాళ్ళు తెలియకపోవడం మంచిదయింది అనుకొన్నారు.

దీనికి ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలి. మన కాళ్ళూ, చేతులే మనకున్న ఆస్తిపాస్తులు. ఈ విశాల ప్రపంచంలో మనకు ఏదైనా పని దొరక్కపోదు. అయితే తమ ఆస్తిపాస్తులు తరిగిపోతున్నాయని తెలిస్తే యజమానులు తట్టుకోలేరు. వాళ్ళు మనల్ని సర్వనాశనం చెయ్యాలని చూస్తున్నప్పుడు మనం ఊరుకోలేం కదా! మనం మన హక్కుల కోసం పోరాడలేదంటే, కాసిన్ని గంజినీళ్ళు కతికి కుక్కల్లా జీవితాంతం ఉండిపోవలసిందే.....ఎలాగూ ఎదురుతిరిగాం..... ప్రస్తుతానికి కాస్త ఒదిగినా సరే, అదును చూసి ముందుకు ఉరకాలి. ఆ కుర్రాడు ఎంత స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడాడు! ఈ బొగ్గుగనుల్లో పనిచేస్తూ అంతటి విషయ పరిజ్ఞానం ఎలా సంపాదించుకోగలిగాడు! అతణ్ణి కొట్టి చంపేశారు కాబోలు. అతణ్ణి చుట్టుముట్టి కదా చితకబాదారు! అతడు బతికి బట్టకడితే మనం అతణ్ణి పూర్తిగా నమ్మొచ్చు, అతడి నాయకత్వాన్ని నమ్మొచ్చు, ఎంత సాహసం! ఎంత వాగ్ధాటి!! అనుకొన్నారు కొందరు.

తుఫాను గాలి అరటితోటల్ని ధ్వంసం చేసి, విశ్రమించినట్టు కార్మికుల మీద దాడి పూర్తయ్యాక శ్మశాన నిశ్శబ్దం అలుముకొంది. నీలాకాశంలో నక్షత్రాలు అక్కడక్కడా మెరుస్తున్నాయి, మిణుగురు పురుగుల్లా, వాటి కాంతినంతా తనలో ఇముడ్చుకొన్నట్టు చంద్రకాంతి వెండి చాపలా చెరువుల మీద మెరుస్తోంది. కొమ్మల్లో గువ్వలు గుసగుసలాడుతున్నాయి. అవి ప్రేమ కబుర్లు కావచ్చు. లేదా తను ఇష్టపడే గువ్వను ఆకర్షించడానికి చేసే ప్రయత్నం కావచ్చు.

నడిరేయి బికాస్ చౌదరికి స్పృహ వచ్చింది. నోరు చివర ఏదో ద్రవం. పెదాలు నాకి చూశాడు. ఉప్పని ద్రవం నాలుకకు తగిలింది. మాంసం వాసన ముక్కుపుటాలను అదరగొడుతుంది. చేత్తో తలనూ తడిమాడు. ఏదో జిగురులాంటి పదార్థం చేతులకి అతుక్కుపోతోంది. వెంట్రుకలు పూర్తిగా రక్తమయం – నుదురు తడిమి చూసుకొన్నాడు.

పెదాలు చిట్లినట్టున్నాయి. నెత్తురు కారుతోన్న స్పర్శ తెలుస్తూనే ఉంది. అతనికి బోధపడింది, ఏదో గొడవ జరిగింది. గాయాల తాలూకు నొప్పీ, ఒళ్ళు నొప్పీ బాధించసాగాయి. నాలుక ఎండిపోయింది. నాలుక కదిలించడం కూడా కష్టంగా ఉంది. లేవడానికి ప్రయత్నించాడు. బండరాతితో అదిమేస్తున్నట్టుగా ఉంది. శరీరం సహకరించడం లేదు. చేతుల్ని నేలకు బలంగా ఆనించి, పసి పిల్లాడిలా దోగాడుతున్నట్టు కొద్దిసేపు దోగాడి, ఆ తరువాత అతి కష్టం మీద లేచి నిలబడ్డాడు. పాలభాగం 'జివ్వు'మంటోంది. ఒళ్ళంతా భరించలేని తాపం. చెవి దగ్గర ఏదో రొద. ఎముకలు లాగేస్తున్నాయి. బట్టలు చిరిగిపోయి, నెత్తురులో తడిశాయి. నడవడానికి ప్రయత్నించాడు. కాళ్ళు మొరాయిస్తున్నాయి. చుట్టూ చిమ్మ చీకటి. కన్నుమిన్నూ కానరావడం లేదు. మబ్బులతో దోబూచులాడుతున్న చంద్రుడి నుంచి సన్నని కాంతి నేల మీదకు ప్రసరిస్తోంది.

హఠాత్తుగా అతణ్ణి నాలుగు చేతులు పట్టుకున్నాయి. ఉలిక్కిపడి తల పైకెత్తి

చూశాడు. నరాలు చిట్లిపోతున్నట్లు బాధ. నాలుక అతుక్కుపోయి, మాటలు పెగలడం లేదు.

తనను పట్టుకున్న చేతుల్ని చూశాడు. ఒక స్త్రీ, ఒక పురుషుడు తనకు ఊతంగా వచ్చినట్టు గ్రహించాడు. ఎవరు వీళ్ళు? వెంటనే స్ఫురించలేదు. శక్తినంతా కూడదీసుకొని మళ్ళీ పైకెత్తి చూశాడు. అక్కా, బావ. వాళ్ళు సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా బికాస్ చేసిన ప్రసంగం వల్లే కార్మికులు అధికారుల్ని చుట్టుముట్టి 'ఘెరావ్' చేశారనీ, దాని పర్యవసానంగా కార్మికులపై దాడి జరిగిందనీ తప్పించుకొన్ని పారిపోయిన కార్మికుల ద్వారా తెలుసుకొని, బహుశా బికాస్ మరణించి ఉంటాడని భావించి పరుగు పరుగున వచ్చారు. అతడు ప్రాణాలతో బయటపడడం చూచి ఊపిరి పీల్చుకున్నారు. అతణ్ణి ఎత్తుకొని ముందుకు కదిలారు.

8

మరుసటి రోజు మామూలుకన్న అరగంట ముందే వినిపించింది సైరన్ కూత. ముందు రోజు ఏమీ జరగనట్టే కార్మికులు గనిలోకి వెళ్ళారు. కార్మికుల్ని పనిలోంచి తొలగించినట్టు నోటీసు బోర్డు ద్వారా తెలియజేసింది యాజమాన్యం. వాళ్ళు బికాస్ చౌదరి, దిలీప్ పాశ్వాన్లు. అధిక సంఖ్యలో కార్మికుల మీద ఏ చర్యా తీసుకోకుండా యాజమాన్యం గడుసుదనం ప్రదర్శించింది. వాళ్ళందరూ జీతం లేకుండా కేవలం రేషన్ మాత్రం పుచ్చుకొని పనిచేస్తున్నారు కదా. మరోసారి ఏదైనా సమస్యను లేవదీస్తే వట్టి చేతులతో పంపేయవచ్చు. అసలు ప్రస్తుత సమస్యనే వాడుకొని కార్మికుల్ని మరింతగా తొక్కిపెట్టి పనులు చేయించుకోవచ్చన్నది యాజమాన్యం వారి వ్యూహం. అందుకే యాజమాన్యం మౌనంగా ఉంది.

జనరల్ మేనేజరు, మైనింగ్ ఇంజనీరు, మైనింగ్ సర్దార్, గుమస్తా ఈ నలుగురూ గనిలోకి వెళ్ళారు. కార్మికుల మనస్సుల్లో ఏర్పడ్డ భయాన్ని తమకు అనుకూలంగా మలచుకొని, మరింతగా పని చేయించుకోవడానికి పథకం పన్నారు. సైరన్ కూత అరగంట ముందే వినిపించడం దాని తాపత్రయం కొద్దీ ముందుగానే గనిలోకి ప్రవేశించారు.

ఇకపై మామూలు కన్నా అర టబ్బు ఎక్కువగా బొగ్గు తవ్వి పోయాలని కొత్త నిబంధన విధించారు. బోనులో పడ్డ ఎలుకలా తయారైంది వాళ్ళ పరిస్థితి. ఆ నిబంధనను తిరస్కరించి వేరే ఉద్యోగం ఏదైనా వెతుక్కోవాలనుకుంటే యాజమాన్యం తమకు, బకాయి పడ్డ జీతం రాళ్ళకు తిలోదకాలు వదులుకోవలసిందే. (నిరాయుధ ప్రాణుల్లా నిలబడ్డ కార్మికులు) నోరు లేని అనాథ పిల్లల్లా యాజమాన్యం చూపిన బాటలో నడవసాగారు.

తమకున్న అధికారాల్ని కార్మికులు గుర్తుచేస్తున్నట్టుగా అధికారులు చిన్నచిన్న లోపాలను ఎత్తి చూపడం, కొద్దిపాటి శిక్షలు విధించడం అలవాటు చేసుకొన్నారు. తమ యాజమాన్యానికి తాము నమ్మదగిన కాపలా కుక్కలుగా కనిపించాలన్నదే వాళ్ళ ధ్యేయం.

కార్మికులకు బుద్ధి చాతుర్యం, విషయపరిజ్ఞానం ఉండాలని యాజమాన్యం వాంఛించడం లేదు. వాళ్ళు అలా ఉంటే, తమకు కలుగుతోన్న విపరీత లాభాలకు విఘాతం కలుగుతున్నది. గతానుభవాలు ద్వారా వాళ్ళు గ్రహించిన విషయం వాళ్ళ ఐక్యతకు భంగం కలిగించాలనీ, వాళ్ళను ఆలోచించనివ్వకుండా మత్తులో జోగేలా చేయాలని భావించారు. అణిచిపెట్టడం ఎక్కువ కాలం సాగదని కూడా గ్రహించారు.

పనిలోంచి తిరుగుముఖం పట్టిన కార్మికులు తిన్నగా వెళ్ళి బికాస్‌ను కలిశారు "పనిభారం విపరీతంగా పెరిగింది. విరామ సమయం అన్నది కేవలం మాటలకే పరిమితం. చేతులు పూర్తిగా కడుక్కోక ముందే మైనింగ్ గుమాస్తా పట్టుకొని పనిలోకి తోసేస్తాడు. ఎముకలు విరిగిపోయేలా పని వత్తిడి. కూలీ బకాయి డబ్బులు పోతేపోని అనుకొని పారిపోదామా అనిపిస్తోంది. ప్రణాళిక లేకుండా తిరుగుబాటు చేయడం పొరపాటు. మన ఐకమత్యం దెబ్బతింది. హక్కుల గురించి మాట్లాడితే చాలు, మన కార్మికులందరూ చెవులు మూసేసుకొంటున్నారు. చివరికి దిగులూ, అపనమ్మకం మాత్రమే మిగిలాయి. మీరు ఉద్యోగం కోల్పోయి, వెలుపల ఉన్నారు. మాతో మీరున్న ధైర్యం, ఉత్సాహం కలుగుతాయి. అంతా పనిచేసే యంత్రాల్లా తయారయ్యారు అన్నారు వాళ్ళు.

ఇంతటి విషాదంలోనూ కార్మికులు తనకై ఎదురుచూడడం తెలిసి అతడి కళ్ళు చెమ్మగిల్లాయి. 'న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి వీలుందేమో చూడాలి. ఆత్మవిశ్వాసం కోల్పోయిన కార్మికుల్లో మళ్ళీ ఆత్మవిశ్వాసం కలిగించాలి. ఐకమత్యం నెలకొల్పాలి, హక్కుల్ని కాపాడాలి' అనుకొన్నాడు. నిజానికి తిరుగుబాటు విఫలమవడం వల్ల అతడు కూడా విషాదంలో మునిగిపోయాడు. అయినప్పటికీ అతడి మనసులో భవిష్యత్తు పట్ల ఆశాభావాన్ని ఎగదోసింది. ఎందుకంటే, కార్మికుల వద్ద ఉన్నదల్లా శ్రమ మాత్రమే. అది ఆగిపోతే ప్రపంచమే స్తంభించిపోతుందన్న అవగాహన అతడిది.

అతడి మెదడులో సరికొత్త ఆలోచనలు పురుడుపోసుకొన్నాయి. సమస్యల వలయంలోంచి కార్మికుల్ని బయట పడేయాలి. ఇతర కార్మికులతో కలిసి చర్చించి, న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తీర్పు కార్మికులకు అనుకూలంగానే వచ్చింది. అయితే గనిని గుత్తకు తీసుకొన్న తివారీ పాతబకాయిలు చెల్లించకుండానే పారిపోయాడు.

దేనికోసమైతే కఠిన నిబంధనల్ని భరించారో, శిక్షల్ని అనుభవించారో అది కాస్తా అందకుండా పోయింది. చేతిరాయిగా మారిన జీతం రాళ్ళు వాళ్ళను ఎంతో ఉద్వేగానికి, బాధలకూ గురిచేసినా, న్యాయస్థానంలో తీర్పు సానుకూలం కావడం, కార్మిక సంఘం పెట్టుకోవడానికి అనుమతి లభించడం, తద్వారా తమకు కావలసిన సదుపాయాల్నీ, హక్కుల్నీ, కోరికల్నీ యాజమాన్యం ముందుంచే అవకాశం లభించడం వాళ్ళకు ఎంతో ఊరట కలిగించింది. బికాస్‌కూ, దిలీప్‌కూ మళ్ళీ ఉద్యోగం దక్కింది.

తివారీ స్థానంలో మరోవ్యక్తి గనిని గుత్తకు చేసుకొన్నాడు.

బికాస్‌కు ఈ రంగంలో ఎంతో అనుభవం ఉంది. ఇక్కడికి రావడానికి ముందు మరోగనిలో ఐదేళ్ళు పనిచేశాడు. అక్కడ ఎన్నో పోరాటాలు, సమ్మెలూ జరిగాయి. వ్యవహారం పోలీసుల దాకా వెళ్ళిన సంఘటనలూ, గూండాలతో దాడి చేయించిన సంఘటనలూ ఉన్నాయి. పోరాటాల్లో బికాస్ కీలకపాత్ర పోషించాడు. ఒకసారి దీర్ఘకాలిక సమ్మె జరుగుతున్నప్పుడు, గనిని పేల్చివేయడానికి పథకం పన్నాడన్న తప్పుడు అభియోగంతో పనిలోంచి తీసేశారు. పూర్వానుభవాలు అతడికి బాగా ఉపకరించాయి. యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలు కలిసొచ్చాయి. పోరాటం ప్రగతికి సాహసం. కొన్నిసార్లు అది ఊగిసలాడవచ్చు. వీగిపోవచ్చు, అణగారినట్టు కనిపించవచ్చు. కానీ నిజానికి పోరాటం ఓటమి ఎరుగదు. ఇనుపకమ్ములా దృఢంగా నిటారుగా నిలబడుతుంది. అతడికా నమ్మకం ఉంది.

ప్రతీకారవాంఛతో యాజమాన్యం పనివత్తిడి పెంచడం వల్ల కార్మికులూ తొలుత కలత చెందినా, చివరికి వాళ్ళకూ మేలే జరిగింది. సంఘం పెట్టుకోవడానికి అనుమతి లభించింది. కదిలింపలేని శక్తిగా భ్రమింపచేసిన యాజమాన్యం దిగిరాక తప్పలేదు. కార్మికులు తమశక్తి ఏమిటో తెలుసుకొన్నారు. "హక్కుల్ని అడగడానికి, కోరికల్ని తెలియజేయడానికి ఇప్పుడు ఒక అవకాశం లభించింది, అంతే ఈ హక్కు ద్వారా విస్తృత ప్రయోజనాలు పొందాలంటే స్వార్థాన్ని త్యజించాలని కార్మికులు గ్రహించాలి" అనుకొన్నాడు బికాస్.

(ఇంకావుంది)

కవిత్వమ్

ఎద్దు



- శైలి

ఎద్దుని
బుద్ధి లేదు నాకు
మొద్దులా పనిచేస్తాను
కల్లాకపటం తెలియదు
మాయామర్మం ఎరుగను
బండైనా గుదిబండైనా
నోరుమూసుకొని కట్టించుకుంటాను
కళ్ళకు గంతలతో
గానుగ దూలాన్ని లాగుతాను
చాకిరి గడియారంలా...
మణుగుల కొద్దీ బరువును
మైళ్ళకొద్దీ మోస్తూనే ఉంటాను
ఏసుక్రీస్తులా,
కళ్ళుండి గుడ్డి బతుకు
కాళ్ళుండి జైలుబతుకు
ఇదేగా జీవితం
పగ, ద్వేషంతో పనిలేదు
పదహారణాల కర్మయోగిని
యజమాని దయతలిస్తేనే
నీరైనా, కుడితైనా
మాటనేర్వని మూగజీవిని కదా
అందుకే ప్రతిదానికి
దెబ్బలే దెబ్బలు
వాతలే వాతలు
ఉంటుంది నాకో కొట్టాం
శుచి శుభ్రం
రోగం రొష్టు అక్కడే
పరిణామంలో
పుట్టుకొచ్చిన
సాధుజీవిని సాదాజీవిని
రక్తమాంసాలు హింస వంటికి పడదు
పచ్చిదైనా ఎండుదైనా పనికిరాని గడ్డి చాలు
ఆ... చెప్పడం మర్చాను
నాకు పుండు లేస్తే
కాకికి కూడా ముద్దే
అన్నదాత రైతుకు
కుడిభుజం నేనే
మరి..
జాతి నిర్మాణంలో
దేశ ప్రగతిలో
నా విలువెంత?
అసలుందంటావా?
పోనీలే
విలువలేకపోయినా
ఆకలి ఉంది.
ఆకలి పెరిగితే
జఠరాగ్ని బ్రద్దలవుద్ది.
సహనం చెలియల కట్ట తెగుద్ది
శ్రమశక్తి ప్రళయమై
విజృంభిస్తుంది
విశ్వరూపం చూపెడుతుంది.

- నాగరాజు

తెలుగు రాచనగరి

ఇరవై మూడు ద్వార బంధాలతో
ఎనిమిది కోట్ల గడపలతో
అందమైన సమైక్య శిఖరాల పుట్ట
నా తెలుగు రాచనగరి భవంతి
రాచనగరి నిర్మాణంకై
పోరాడి సాధించిన ఫలితం అమరమయ్యింది.
పుట్టగొడుగుల్లా
పుట్టుకొచ్చాయి మూఠాలు
పుట్టలో విషపు నాగులు చేరి
మనుగడ పడగలు విప్పాయి
ప్రాంతీయ విషం చిమ్మి



వేర్పాటువాద బుసలు కొట్టాయి
ఏ ఎండకా పడగ విప్పే
అవకాశవాద నల్ల త్రాచులు
మణికిరీటం కోసం
అమావాస్య చీకటిలో నటన మాడాయి
పదవుల నాదస్వరం విన్నాయా
మత్తుగా క్యాబరే ఆడతాయి
అధికార పీఠపు వాసన పీల్చాయా
గమ్మత్తుగా, ఐదేళ్ళదాకా
వానపాముల్లా పండుకుంటాయి.

నిప్పులపై నడక

ప్రపంచంలోని అనేక దేశాలలో నిప్పులపై నడిచే పండుగలు, సందర్భాలు అనేకం వున్నాయి. ఫ్రాన్స్‌లోని ఫ్లోరెక్స్ నగరంలో కొన్ని వందల సంవత్సరాల క్రితం ఓ సాధువు నిప్పులపై నడిచి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. సమత్రా, ఈజిప్టు, అల్జీరియాలలో నిప్పును నోట్లో పెట్టుకుని నిప్పులపై నడుస్తారు. బెంగాల్‌లోని సుందర్ పూర్ గ్రామంలో కాళీ పూజనాడు దేవీ భక్తులు కణకణలాడే నిప్పులపై నడుస్తారు. గోవాలోని సిరికావో గ్రామంలో ఏటా ఓ దేవాలయం ప్రాంగణంలో నిప్పులపై నడిచే వారిని 'డోండ్' అని అంటారు. లరేయ దేవి పూజ సందర్భంగా అడుగు ఎత్తు, మూడు అడుగుల పొడవున పేర్చిన నిప్పులపై నడిచి దేవాలయంలోకి వెళతారు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో అగ్నినృత్యం నిర్వహిస్తారు. అక్కడ నృత్యం చేసే వారు కణకణలాడే నిప్పులపై దూకుతారు. ఆ నిప్పులు సుమారు 600 ఫారన్‌హీట్ డిగ్రీల వేడి కలిగి ఉంటాయి. నృత్యం చేసే వారు నిప్పు కణికలను గాలిలోకి ఎగరేసి బెల్లం ముక్కలా నోటితో పట్టుకుంటారు. మరికొందరు నిప్పుకణికలను చేత్తో రెండు ముక్కలు చేస్తారు. ఒకప్పుడు బౌద్ధులు నిప్పులపై నడిచే ఉత్సవాన్ని నిర్వహించేవారు. బల్గేరియాలో నిప్పులపై నడిచే వారిని 'నిస్టినారెస్' అంటారు. రోమ్‌లోని కొన్ని కుటుంబాలలోని వ్యక్తులు కణకణలాడే నిప్పులపై నడిచేవారు. వారికి పన్నుల నుంచి విముక్తి లభించేది. గ్రీస్‌లో ఇప్పటికీ నిప్పులపై నడిచేవారున్నారు. అక్కడ ఏటా సెయింట్ కాన్ స్టెంటైనా, సెయింట్ హెలెన్‌ల ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో నిప్పులపై నడిచే కార్యక్రమం కూడా ఒక భాగం. ఇలా నిప్పుల పై నడిచే వారిని 'అనాస్టీనెరాడ్స్' గా వ్యవహరిస్తారు. 1974లో పశ్చిమ జర్మనీ చెందిన ఆటమిక్ ఫిజిసిస్ట్ ఫ్రెడ్ వర్డ్ కార్గర్, మ్యూనిచ్‌లోని "ప్లాస్మా ఫిజిక్స్ మెక్ సంస్థ" దళంతో కలిసి ఫిజిలోని వేతు లేవూ ద్వీపంలో నిప్పులపై నడిచే ఆదివాసులను గురించి పరిశీలించడానికి వెళ్ళాడు. ఆయన వేసిన ఈ టాక్సత్ ఫిల్మ్‌లో 200 మంది ఆదివాసులు 4 సెకన్ల పాటు భగభగ లాడే నిప్పు కణికలపై నడిచి 7 సెకన్ల పాటు వాటిపై నిలబడ్డారు. దీని వెనక రహస్యం కోసం ప్రయత్నించారు. నిప్పులపై నడిచే ప్రక్రియను కొందరు శాస్త్రవేత్తలు 'మూర్ఖులు చేసే మాయాజాలం'గా అభివర్ణించారు. అయితే మనదేశంలో దీని రహస్యాన్ని ఎప్పుడో బయటపెట్టారు. నిప్పులపై నడవటంలో దాని వెనుక అతీంద్రియాలు లేవని, వారు దైవాంశ సంభూతులు కారని రుజువు చేశారు.

తెలుసా!

నవ్వుతున్నట్లు కన్పించే గాఫర్

గాఫర్ అనే జీవి అన్ని సమయాల్లోనూ, ఎప్పుడూ చూసినా నవ్వుతున్నట్లు కన్పిస్తుంది. ఈ విలక్షణ లక్షణానికి కారణం దీనికి పళ్ళు ముందుండి తర్వాత పళ్ళ వెనుక నోరుండడం. ఇది భూమిలో బొరియలు చేసుకుని జీవిస్తుంది. కాబట్టి బొరియలు చేయడానికి అనువుగా దీని నోటి ముందు కోర సహజసిద్ధంగా ఏర్పడి వుంటాయి. గాఫర్‌కి గల మరొక వింత లక్షణమేమిటంటే దీని వెన్నెముకలోని కీళ్ళ నడిమిభాగం (కశేరు చక్రం) చుట్టుపక్కల అన్ని వైపులా సులువుగా కదిలే సౌలభ్యముంది. అందువల్లే ఇది ముందుకు ఎంత వేగంగా పరుగెత్తగలదో అదే వేగంతో బొరియలలోకి వెనుకకు కూడా పరుగెత్తగలదు.

అతి పెద్ద స్ఫింక్స్ నిర్మాణం

స్ఫింక్స్ అంటే స్త్రీ తల, సింహ శరీరం వుండే పురాతన నిర్మాణం. అరుదుగా వీటికి రెక్కలు కూడా వుంటుంటాయి. ప్రాచీన ఈజిప్టువారు చొరబాటు దారులనుండి తమ సమాధులకు రక్షణగా ఇటువంటి స్ఫింక్స్‌ల నిర్మాణం చేపట్టేవారు. ఇప్పటి వరకూ వున్నవాటిలో అతిపురాతనమైన, పెద్దదైన స్ఫింక్స్ విగ్రహం గిజాలోని మూడు అతిపెద్ద పిరమిడ్లకు రక్షణగా నిర్మించబడినది. ఇది కైరోకు పశ్చిమంగా 15కిలో మీటర్ల దూరంలోవుంది. ఇది 5000 సంవత్సరాల నాటిదని భావిస్తున్నారు. రాతితో మలచబడిన ఈ స్ఫింక్స్ ఎత్తు 20 మీటర్లు, పొడవు 73 మీటర్లు వుండి ఈ నిర్మాణంలో చిన్న చిన్న ముక్కలు ఊడిపోతున్నాయి. ప్రస్తుతం దీని రక్షణ చర్యలు చేపట్టారు.



గెలుపుకు గుర్తుగా గోపుర నిర్మాణాలు

భారతదేశంలో రాజులు తమ విజయాలకు గుర్తుగా విజయ స్థంభాలను, విజయ గోపురాలను నిర్మించేవారు. అటువంటి వాటిలో అత్యంత సుందరమైన గోపురమొకటి రాజస్థాన్‌లోని చిత్తోడ్‌ఘడ్‌లో వుంది. తొమ్మిది అంతస్థులున్న ఈ గోపురం రాణాకుంభ అనే రాజు క్రీ.శ. 1440లో సాధించిన ఒక విజయానికి ప్రతీకగా నిర్మించాడు. ఈ గోపురం నిర్మాణం పూర్తి కావడానికి ఎనిమిది సంవత్సరాలు పట్టిందట. దీని ఎత్తు 36 మీటర్లు. మొత్తం గోపురాన్నంతా హిందూ దేవతల శిల్పాలచే అలంకరించారు. ఇది రాజపుత్రుల ధైర్యసాహసాలకు అద్భుత విజయాలకు గుర్తుగా నిలుస్తుంది.

పొడుపు కథ విప్పతారా

1.అల్లు డు ఎవరో!

అల్లుడు వచ్చాడు. చొక్కావిప్పాడు. బావిలో దూకాడు. ఇంతకీ ఎవరా అల్లుడు?

2. ఏవరోచ్...

ఆకాశాన రాకాసి.
రాకాసి పిల్లలు నల్లని గుండ్లు
గుండుకు మూడు కళ్లు,
కంట్లో నీరు గలగల పారు,
పారే నీళ్లు పప్పయ్యింది,
పప్పకు బారెడు తోకొచ్చింది
తోక నుంచి పిలకొచ్చింది,
పిలక నవ్వితే పిందెలు రాలు
ఎవరబ్బా అది?

3. ఆకు ఏది?

ఆకెత్తేసి అన్నం తింటారు.
ఇంతకీ ఆ ఆకు ఏదబ్బా...

క్యారెట్ కోట



హాయ్ చిన్నారులూ... మీరు ఎప్పుడైనా కోట చూశారా! అదేనర్రా... కథల్లో రాజుగారి కోట, రాణిగారి కోట అని చెప్తుంటారుకదా. అది. మరైతే ఆ కోటలను వేటితో కడతారు? రాళ్లు, మట్టి, ఇసుక, సున్నంతో. మరి అప్పట్లో సిమెంట్ లేదుకదా. అయితే మరి ఎప్పుడైనా క్యారెట్ కోట చూశారా! అదేనోయ్ . క్యారెట్లతో చేసిన కోటను చూశారా (మీకో రహస్యం చెప్పనా! దీన్ని కట్టొచ్చు. తర్వాత మనమే తినొచ్చు). ఇవాళ మనం దాన్ని ఎలా కట్టాలో చెప్పకుందాం. మరి రెడీనా!

చేద్దామా

ఏమేం కావాలంటే...

క్యారెట్లు, కమలా పండు, టూత్ పిక్స్ (పళ్లు కుట్టుకునే పుల్లలు), ద్రాక్షపళ్లు, యాపిల్.

ఎలా చేయాలంటే...

ముందుగా క్యారెట్లు తీసుకుని శుభ్రంగా కడిగి తుడవండి. తర్వాత రెండువైపులా చదునుగా వుండేలా కత్తిరించండి. మరి నిలబెడితే కిందపడిపోకూడదుకదా. కమలాపండు తీసుకొని చక్కగా మధ్యలో రెండు చక్రాల్లా కత్తిరించి పక్కన పెట్టండి. యాపిల్ పండు తీసుకొని త్రికోణాకారపు జండాను తయారుచేసుకోవాలి. ఇప్పుడు ఒక ప్లేట్ తీసుకోండి. చక్కగా బొమ్మలో చూపించినట్టు క్యారెట్లను ప్లేట్‌మీద నిలబెట్టండి. ముందు, వెనుక వరుసల్లో కమలాపండు రింగులు పెట్టాలి. ఇప్పుడు వీటి మధ్యలో ద్రాక్షపళ్లు పోయాలి. అలాగే ఒక క్యారెట్‌కి టూత్‌పిక్ గుచ్చిన జండాను వుంచాలి. అంతే క్యారెట్ కోట రెడీ. చూడ్డానికి కలర్‌ఫుల్‌గా చాలా బాగుంటుంది. ఇప్పుడు ఈ కోటను మనం ఎంచక్కా తినేయొచ్చు. మరి క్యారెట్లు, ద్రాక్షపకు ,, కమలాపండు చక్రాలు అన్నీ తినదగినవేకదా. మరింకెందుకాలస్యం? చకచకా లాగించేయొచ్చు. వినోదానికి వినోదం, ఆహారానికి ఆహారం. బావుందా క్యారెట్ కోట!

-చూటీ

జంట పదాలు

హాయ్ నేస్తాలూ... ఇదిగో ఇక్కడ 12 బొమ్మలున్నాయికదా. రైమింగ్ పదాలను జత చేయగలరా! ఆ అన్నట్టు రైమింగ్ పదాలంటే తెలుసుకదా. కుక్ - బుక్‌లాగా. మనం ఈ బొమ్మలో వున్న వాటిని నోటితో పలుకుతుంటే ఒకేలా అనిపిస్తుంది. ఆ పదాలను వరుసగా రాయండే.

పదాలు పూరిద్దాం

హాలో...ఇక్కడ కనిపిస్తున్నాడే వాడు పెద్ద చాకు. చాలా కష్టపడి ఈ పజిల్ తయారుచేశాడు. ఇందులో 16 ఆంగ్ల పదాలున్నాయి. అవేంటంటే... bike, look, car, lime, entry, kite, easy, mean, calm, net, room, ray, neat, ten, kind, yolk. మీరేం చేయాలంటే వాటిని ఖాళీల్లో పూరించాలి. అదీ చకచకా. మరి మొదలెట్టండీ. తర్వాత మా జవాబుతో సరిచూసుకోవడం మరువకండి.



ఎన్ని బంతులో...

పిల్లలూ మీకు బంతులంటే చాలా ఇష్టం కదా. ఐతే ఇక్కడ విదూషకుడు రకరకాల బంతులను తీసుకొని ఆడుతున్నాడు. మీరేం చేయాలంటే అతను ఎన్ని రకాల బంతులతో ఆడుతున్నాడు. అసలు అక్కడ వున్న బంతులెన్ని? చెప్పాలి.





కదులుతున్నాయా?

హాయ్ చిన్నారులూ...ఇక్కడ గోలీలు చాలా వున్నాయికదా. అవి బొమ్మగోలీలే అని మీకు తెల్సుకదా. కానీ వాటిని కదిలించొచ్చు. అయితే ఒక మంత్రం వేయాలి. వేసేస్తున్నాం. వేసేశాం. అయితే మరి దీక్షగా కళ్లార్పకుండా వాటినే చూడండి. అవి కదులుతుంటాయి. కదులుతున్నాయా? మీ నేస్తాలకు కూడా చూపించండే.

చిన్నారి చిత్రకారులు

కె. సాహిల్,
7వ తరగతి,
గౌతమ్ మోడల్ స్కూల్,
హైదరాబాద్.



కె. వీరేంద్ర,
3వ తరగతి,
ఒమ్మెవరం,
ప్రకాశం.

మీరూ బొమ్మలేస్తారా? అయితే ఆలస్యం ఎందుకు? పోస్ట్ కార్డు తీసుకుని నలుపు స్కెచ్‌పెన్నుతో బొమ్మవేసి పంపండి. అన్నట్టు మీ పేరు, తరగతి, ఊరు వివరాలు రాయటం మరువకండి.

మా చిరునామా...

చిన్నారి చిత్రకారులు, ప్రజాశక్తి, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

జవాబులు

పదాలు పూరిద్దాం :



పొడుపు కథ విప్పుతారా:

1. అరటిపండు
2. తాటి చెట్టు, తాటి కాయలు, తాటి ముంజెలు, తాటి తేగలు
3. కరివేపాకు.

ఎన్ని బంతులో...:

మొత్తం బంతులు: 26 , మొత్తం ఎన్ని రకాల బంతులున్నాయి:10

పదిహేనవ లోక్‌సభ ఎన్నికలు జరగడం...కొత్త ప్రభుత్వం ఏర్పడడం .. పార్లమెంటు సభ్యులు, మంత్రులు ప్రమాణస్వీకారం చేయడం చూస్తుండగానే జరిగిపోయింది. ఈ సందర్భంగా అసలు పార్లమెంటు ఎలా వుంటుంది? పార్లమెంటరీ భవన విశేషాలేంటి? ఎంతో విశిష్టత కలిగిన పార్లమెంటు నిర్మాణం ఎలా వుంటుంది? పార్లమెంటులో ఎన్ని విభాగాలున్నాయి? వంటి వివరాలు ఈ వారం అట్టమీది కథలో మీకోసం...

- డి. జయప్రకాష్

మన పార్లమెంటు
సర్వోన్నత సమావేశం

1950, జనవరి 26 నుండి అమల్లో ఉన్న భారత రాజ్యాంగం, దేశంలో పార్లమెంటరీ ప్రభుత్వ విధానం అమలుకు బాటలు వేసింది. వచ్చే ఏడాది జనవరి 26తో భారత పార్లమెంటరీ వ్యవస్థ షష్టిపూర్తి జరుపుకోనుంది. ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా ఇంత సుదీర్ఘకాలం ఒక దేశంలో పార్లమెంటరీ ప్రభుత్వ విధానం అమలవ్వడమూ విశేషమే. ప్రపంచ దేశాల్లో మన దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు రావడానికి ఇదీ ఒక కారణమే. ఇంతటి విశిష్టత కలిగిన దేశ పార్లమెంటరీ వ్యవస్థ పనితీరు, పార్లమెంటు భవనం విశేషాల గురించి కొత్త ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా ఈ వారం తెలుసుకుందాం. భారత పార్లమెంటరీ వ్యవస్థలో రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ మూడు అవిభాజ్య అంగాలు. కేంద్ర మంత్రి మండలి సూచనల మేరకు రాష్ట్రపతి ఇచ్చే ఆదేశాల ప్రకారం పార్లమెంటు పనిచేస్తుంది. దేశంలోని అత్యున్నత చట్టసభగా పరిపాలన, విధాన నిర్ణయాల్లో పార్లమెంటుదే సర్వాధికారం. కేంద్ర మంత్రిమండలితో పాటు వివిధ స్థాయిల్లోని అధికారగణం కూడా పార్లమెంటుకే బాధ్యత వహించాలి. భారత రాజ్యాంగం ఆధారంగా దేశంలో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు 1951-52లో జరిగాయి. 1952 ఏప్రిల్ 3న మొదటిసారి రాజ్యసభ ఏర్పాటవ్వగా, అదే ఏడాది మే 13న లోక్‌సభ మొదటి సమావేశం జరిగింది.

విశిష్ట నిర్మాణం

దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న భారత పార్లమెంటు భవనం, ప్రపంచంలోని అతిపెద్ద పార్లమెంటు భవనాల్లో ఒకటి. ప్రముఖ బ్రిటీష్ భవన రూపకర్తలు సర్ ఎడ్విన్ లూటెన్స్, సర్ హెర్‌బర్ట్ బేకర్ ఈ భవనానికి ప్రత్యేకంగా రూపురేఖలు దిద్దారు. మాంటెగు-చేమ్స్‌ఫర్డ్ సంస్కరణల అమల్లో భాగంగా, నాటి బ్రిటీష్ ప్రభుత్వం దేశంలో ఒక చట్టసభను రూపొందించాలని భావించింది. ఫలితంగానే భారత పార్లమెంటు భవన నిర్మాణం ప్రారంభమయ్యింది. 1921-27 మధ్య ఆరు సంవత్సరాల పాటు భవన నిర్మాణం జరిగింది. 1927, జనవరి 18న నాటి గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ భవన ప్రారంభోత్సవం చేశారు. ఆ రోజుల్లోనే ఈ భవన నిర్మాణానికి సుమారుగా 87 లక్షల రూపాయల వ్యయమయ్యింది. పూర్తిగా వృత్తాకారంలో ఉండే ఈ భవనంలో నాలుగు అంతస్తులున్నాయి. మొత్తం భవన వ్యాసార్థం సుమారుగా 170 మీటర్లు. సుమారుగా ఆరు ఎకరాల వైశాల్యంలో భనవ నిర్మాణం జరిగింది. మొదటి అంతస్తులో అతిపెద్ద వరండా ఉంది. ఇక్కడ నిర్మించిన 144 స్థంభాలు మొత్తం భవనానికే ప్రధాన ఆకర్షణ. ఒక్కో స్థంభం ఎత్తు సుమారుగా 27 అడుగులు ఉంటుంది. వివిధ పార్టీల కార్యాలయాలు, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ కార్యాలయాలు, వివిధ పార్లమెంటరీ కమిటీల కార్యాలయాలు ఈ నాలుగు అంతస్తుల్లో ఉంటాయి. భవనంలో అత్యధిక భాగం ఎర్ర ఇసుకతో నిర్మించబడింది. భారత వాస్తు కళను, హస్తకళను కళ్లకు కట్టే విధంగా అనేక ప్రాంతాల్లో ప్రత్యేక జాలీలు, గోళాలు ఏర్పాటు చేశారు.

మూడు విభాగాలు

వృత్తాకార పార్లమెంటు భవనం మధ్యలో లోక్‌సభ, రాజ్యసభ, సెంట్రల్ హాల్ నిర్మితమై ఉన్నాయి. సెంట్రల్ హాల్‌కు ఇరువైపులా లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలుంటాయి. సుమారుగా 30 మీటర్ల వ్యాసార్థంతో ఉంటే సెంట్రల్ హాల్ గోళం ప్రపంచంలోనే అతిపెద్ద గోళాల్లో ఒకటి. 1952 ముందు వరకూ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ, కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ (రాజ్యాంగ సభ) సమావేశాలు ఈ మందిరంలోనే జరిగాయి.



బ్రిటన్ పార్లమెంట్

బ్రిటిష్ పార్లమెంటును ప్రపంచంలోని పార్లమెంటులకే తల్లివంటిదంటారు. ఎందుకంటే అనేక దేశాల పార్లమెంటరీ వ్యవస్థలకు ఇది నమూనాగా నిలిచింది. ఇక్కడ కూడా మన దేశంలోలాగే ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్), దిగువసభ (హౌస్ ఆఫ్ కామన్స్) వున్నాయి. అయితే పార్లమెంటులో రాణి కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఎగువసభ సభ్యులను ప్రజలు ఎన్నుకోరు. ప్రధానమంత్రి సలహా మేరకు రాణి వారిని నియమిస్తుంది. దిగువ సభలో వున్న 646 మంది సభ్యులు ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. సగానికి పైగా స్థానాలను గెల్చుకున్న పార్టీ అధినేత ప్రభుత్వాన్ని ఏర్పరుస్తాడు. ఒకవేళ అంతకన్నా తక్కువ స్థానాలను సంపాదించినా సరిపడా మెజారిటీకోసం ఇతర చిన్న పార్టీల మద్దతు తీసుకోవచ్చు. అప్పుడు మాత్రమే ప్రభుత్వ ఏర్పాటుకు వారిని రాణి ఆహ్వానిస్తుంది. చట్టపరంగా రాణి సర్వాధికారిణి. పార్లమెంటులో ప్రతిదీ ఆమె ఆమోదంతోనే జరుగుతుంది. అత్యున్నత అధికారాలు రాణి చేతుల్లో వున్నట్టు కనిపించినా వాస్తవాధికారాలు దిగువసభవే. రాణి కేవలం ప్రధాని సలహా మేరకు పని చేస్తుంది. అంతేకాదు ఎగువసభ అధికారాలు కూడా పరిమితమైనవే. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ భవనంలో ఈ రెండు సభలూ రెండు ప్రత్యేక ఛాంబర్లలో సమావేశమౌతాయి. బ్రిటిష్ పార్లమెంటు 1707లో ఏర్పడింది.

1947, ఆగస్టు 15న బ్రిటీష్ వారి నుండి దేశానికి అధికారికంగా స్వేచ్ఛ లభించిందీ ఇక్కడే. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశాలకు ఈ మందిరాన్ని వినియోగిస్తున్నారు. మిగతా సమయంలో ఇరు సభల సభ్యులకూ ఇది విశ్రాంతి మందిరంగా, రాజకీయ ముచ్చట్లకు వేదికగా ఉపయోగపడుతోంది. నెహ్రూ, వల్లభాయ్ పటేల్, రవీంద్రనాథ్ ఠాగూర్, మౌలానా అజాద్, ఇందిరాగాంధీ తదితర ప్రముఖుల నిలువెత్తు చిత్ర పటాలు మందిరంలో అలంకరించబడ్డాయి. సెంట్రల్‌హాల్‌కు ఆనుకుని అర్ధ వృత్తాకారంలో ఉన్న లోక్‌సభ ప్రాంగణం విస్తీర్ణం సుమారుగా 4800 చదరపు అడుగులు. మందిరంలో ఆరు నిలువు వరుసల్లో మొత్తం 550 మంది కూర్చోవడానికి వీలుంది. స్పీకర్ వేదికకు ఇరువైపులా ఉండే ప్రత్యేక బాక్సుల్లో వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, విశిష్ట విదేశీ ప్రతినిధులు కూర్చోవడానికి ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. మందిరంలోని మొదటి అంతస్తులో విలేకరులు, రాజ్యసభ సభ్యులు, విదేశీ రాయబారులు, స్పీకర్ అతిథులు, సాధారణ ప్రేక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలున్నాయి. రాజ్యసభ ప్రాంగణం కూడా దాదాపుగా లోక్‌సభనే పోలి ఉంటుంది. ఇందులో కేవలం 250 మంది కూర్చోవడానికి మాత్రమే వసతి ఉంది. పార్లమెంటు భవన ప్రాంగణంలోని ప్రధాన ద్వారానికి ఎదురుగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ఉంటుంది. దీంతో పాటు చంద్రగుప్త మౌర్యుడు మొదలుకొని దేశ చరిత్రలో కీలకపాత్ర పోషించిన మోతీలాల్ నెహ్రూ, గోపాలకృష్ణ గోఖలే, అరబిందో, అన్నాదొరై, అంబేద్కర్, భగత్‌సింగ్ తదితర ఎందరో ప్రముఖుల విగ్రహాలు భవనం చుట్టూ దర్శనమిస్తాయి.

లైబ్రరీ, మ్యూజియం

పార్లమెంటు భవనం వెలుపలి ప్రాంగణంలో మూడు భవన సముదాయాలున్నాయి. 1. లైబ్రరీ, 2. రిసెప్షన్ కార్యాలయం, 3. పార్లమెంటు అనెక్సీ. 2002 ముందు వరకూ పార్లమెంటు లైబ్రరీ భవన ప్రాంగణంలోనే నడిచేది. పెరుగుతోన్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1994లోనే నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడు సంవత్సరాల తొమ్మిది మాసాల పాటు ఈ భవన నిర్మాణం జరిగింది. 2002, మే 7న నాటి రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ నూతన భవనాన్ని ప్రారంభించారు. సుమారుగా 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమైన ఈ భవనం ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతాలకు నెలవు. అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన 12 గోళాలు దేశంలోనే అరుదైన నిర్మాణాలుగా గుర్తింపు సాధించాయి. లక్షలాది పుస్తకాలతో పాటు, అరుదైన డాక్యుమెంట్లు, పార్లమెంటు ఉభయసభల్లో వివిధ బిల్లులు, తీర్మానాల ఆమోద సమయంలో జరిగిన చర్చలు, సభ్యుల ప్రసంగాలు ఇక్కడ నిక్షిప్తమై ఉన్నాయి. దృశ్య-శ్రవణ రూపంలో

ఈజిప్ట్ పార్లమెంట్

ఈజిప్ట్ పార్లమెంట్ ఆ దేశ రాజధాని కైరోలో వుంది. 1866 వ సంవత్సరం నుంచి ఇక్కడ పార్లమెంటరీ వ్యవస్థ ప్రారంభమైంది. ప్రస్తుత తరహా పార్లమెంటు ఏర్పడడానికి ముందు అది ఎన్నో మార్పులకు గురైంది. 135 సంవత్సరాలకు పైగా వున్న ఈజిప్టు పార్లమెంటు చరిత్రలో 32 పార్లమెంటులు ఏర్పడ్డాయి. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం పార్లమెంటులో రెండు సభలున్నాయి. 1. పీపుల్స్ అసెంబ్లీ (దిగువ సభ), 2. షురా కౌన్సిల్ (ఎగువ సభ). దిగువ సభ కొత్త రాజ్యాంగం ప్రకారం 1971లో ఏర్పడింది. ఇందులో 454 మంది సభ్యులుంటే 444 మందిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటే మిగతా 10 మందిని అధ్యక్షుడు ఎంపిక చేస్తాడు. రాజ్యాంగం ప్రకారం కార్మికులు, రైతులకు 50 శాతం సీట్ల రిజర్వేషన్ వుంది. ఎగువ సభ షురా కౌన్సిల్‌ను ఆంగ్లంలో కన్సల్టేటివ్ కౌన్సిల్ అంటారు. ఇది 1980లో రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 264 మంది సభ్యులుండగా 174 మంది సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. తతిమ్మా వారిని రాష్ట్రపతి ఎంపిక చేస్తారు. వీరి పదవీకాలం ఆరు సంవత్సరాలు. అయితే ఈ సభకు స్వల్పమైన అధికారాలు మాత్రమే వుంటాయి.



కూడా ఎంతో సమాచారాన్ని దాచి ఉంచారు. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఎంతో సమాచారాన్ని కంప్యూటరీకరించారు. పార్లమెంటు సభ్యులతో పాటుగా విలేకరులు, ఇతర రీసెర్చి విద్యార్థులకు ఇటీవలే లైబ్రరీలో ప్రవేశావకాశం కల్పించారు. సుమారు వేయి మంది కూర్చునేందుకు వీలుగా ఈ భవనంలో ఆధునిక ఆడిటోరియం నిర్మించారు. రాష్ట్రానికి చెందిన మాజీ స్పీకర్ జీఎంసి బాలయోగి పేరును ఈ ఆడిటోరియానికి పెట్టారు. లైబ్రరీ భవనంలో అంతర్భాగంగానే ప్రత్యేకంగా పార్లమెంటు మ్యూజియంను రూపొందించారు. 14వ లోక్‌సభ స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ చొరవతో 2005లో ప్రారంభమైన మ్యూజియం పనులు ఏడాది కాలంలోనే పూర్తయ్యాయి. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో, సాంకేతిక, సమాచార వ్యవస్థతో రూపొందిన ఈ మ్యూజియం 2006 సెప్టెంబర్ నుండి వీక్షకులకు అందుబాటులోకి వచ్చింది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలు, బ్రిటీష్ పరిపాలన, స్వాతంత్ర్య పోరాటం, అధికార మార్పిడి, రాజ్యాంగ రూపకల్పన, పార్లమెంటరీ వ్యవస్థ ఏర్పాటు, పని విధానం తదితర ఎన్నో అంశాలను అందరికీ అర్థమయ్యే రీతిలో ఇక్కడ దృశ్య-శ్రవణ రూపాల్లో పొందుపరిచారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.

ఏడాదిలో ఎప్పుడైనా సందర్శన

భారత పార్లమెంటు భవన ప్రాంగణాన్ని, పార్లమెంటు మ్యూజియంను సందర్శకులు ఏడాది పొడవునా ఎప్పుడైనా వీక్షించవచ్చు. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు జరిగే సమయంలో పార్లమెంటును సందర్శించడానికే ఎక్కువమంది ఇష్టపడతారు. భవన సందర్శన కోసం ముందస్తు పాసులు తప్పనిసరి. భవన ప్రాంగణంలోని రిసెప్షన్ కార్యాలయంలో పాసుల జారీ ప్రక్రియ జరుగుతుంది. సందర్శకులు రెండు విధాలుగా పాసులు పొందవచ్చు. వ్యక్తులు లేదా గ్రూపులుగా పార్లమెంటు సందర్శన కోసం అర్జీలు పెట్టుకోవచ్చు. దీనికి ఎక్కువ సమయం పడుతుంది. పార్లమెంటు సభ్యుల సిఫార్సు ఆధారంగా కొద్ది రోజుల వ్యవధిలోనే పాసులు పొందవచ్చు. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు, సందర్శకులు ఒక గంట పాటు సభా కార్యకలాపాలను ప్రత్యక్షంగా గ్యాలరీల నుండి తిలకించవచ్చు. సమావేశాలు జరగని సమయంలోనూ ఉభయ సభలనూ తిలకించవచ్చు. పార్లమెంటు మ్యూజియం సందర్శనకు రిసెప్షన్ కార్యాలయంలో సులువుగానే పాసులు లభిస్తాయి.

లోక్‌సభ-రాజ్యసభ

భారత రాజ్యాంగంలోని మార్గదర్శకాల ఆధారంగా ప్రస్తుతం లోక్‌సభ సభ్యుల సంఖ్యను 545గా, రాజ్యసభ సభ్యుల సంఖ్యను 245గా నిర్ణయించారు. లోక్‌సభకు వివిధ రాష్ట్రాల నుండి 530 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 13 మంది సభ్యులు ఎన్నికవుతారు. ఇద్దరు ఆంగ్లో ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి లోక్‌సభ సభ్యులుగా నియమిస్తారు. రాజ్యసభలో 232 మంది సభ్యులు వివిధ రాష్ట్రాల నుండి పరోక్ష పద్ధతిలో ఎన్నికవుతారు. మరో 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. లోక్‌సభ సభ్యునికి కనీస వయోపరిమితి 25 సంవత్సరాలు కాగా, రాజ్యసభ సభ్యునికి 30 సంవత్సరాలు. ఉభయ సభల ప్రాథమిక విధీ చట్టాలను రూపొందించడమే. ఏ బిల్లైనా తొలుత ఉభయ సభల ఆమోదమూ పొందాలి. అనంతరం రాష్ట్రపతి ఆమోదం లభించాక ఆ బిల్లు, చట్టంగా మారుతుంది. చట్టాల రూపకల్పనతో పాటు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పద్దులకు ఆమోదం తెలపడం, పలు ప్రజాసమస్యలపై, విధానపర అంశాలపై చర్చలు జరపడం, తీర్మానాలను ఆమోదించడం ఇరు సభల ఇతర ముఖ్య విధులు. లోక్‌సభ నిర్వహణా బాధ్యతలను స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ బాధ్యతలను ఛైర్మన్ (ఉప రాష్ట్రపతి), డిప్యూటీ ఛైర్మన్ పర్యవేక్షిస్తారు. ఉభయ సభల మధ్యా అనేక మౌలికమైన తేడాలు కూడా ఉన్నాయి. లోక్‌సభ కాలపరిమితి సాధారణంగా 5 సంవత్సరాలు. రాజ్యసభకు కాలపరిమితేమీ లేదు. ప్రతి రెండేళ్లకొకసారి సభలోని మూడోవంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. ఆర్థిక బిల్లులను తొలుత లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదం పొందిన ఆర్థిక బిల్లులను తిరస్కరించే అధికారం రాజ్యసభకు లేదు. ప్రాథమికంగా కేంద్ర మంత్రివర్గం లోక్‌సభకు మాత్రమే జవాబుదారీగా ఉంటుంది. అఖిల భారత సర్వీసుల ఏర్పాటు, కొత్త రాష్ట్రాల ఏర్పాటు, రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదం తదితర అంశాల్లో రాజ్యసభ కూడా కీలకపాత్ర పోషిస్తుంది.

లోక్‌సభకూ ఒక ఛానల్

సభా కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారం విషయంలో కూడా భారత పార్లమెంటుకు విశిష్ట స్థానం ఉంది. 2006 మేలో ప్రారంభమైన లోక్‌సభ ఛానల్, పూర్తిగా ఒక చట్టసభ ద్వారా నిర్వహించబడుతోన్న మొట్టమొదటి ఛానల్‌గా రికార్డు సృష్టించింది. 14వ లోక్‌సభ స్పీకర్ సోమ్‌నాథ్ వ్యక్తిగత చొరవ, పట్టుదల కారణంగానే ఛానల్ స్థాపన సాధ్యమైంది. అప్పటివరకూ సభా కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాల కోసం దూరదర్శన్‌పై ఆధారపడాల్సి వచ్చేది. దూరదర్శన్ నుండి ప్రత్యక్ష ప్రసారాలను స్వీకరించడానికి, ప్రైవేటు ఛానల్స్ గంటకు సుమారుగా 90 వేల రూపాయల చొప్పున చెల్లించాలి వచ్చేది. లోక్‌సభ ఛానల్ స్థాపనతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రైవేటు ఛానళ్లతో పాటుగా, దూరదర్శన్‌కు కూడా ఇప్పుడు ప్రత్యక్ష ప్రసారాలు, ఇతర ప్రసారాల ఫీడ్‌ను లోక్‌సభ ఛానల్ నుండి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమికంగా సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో ప్రారంభమైన ఈ 24 గంటల ఛానల్, వాణిజ్యపరంగానూ ఇప్పుడు సంతృప్తికర స్థాయిలో పనిచేస్తుండటం విశేషం.

★



అమెరికన్ పార్లమెంట్

దీనిని 'కాంగ్రెస్' అని పిలుస్తారు. ఇందులో కూడా రెండు సభలున్నాయి. సెనేట్, హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్. డెమొక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ ప్రధాన రాజకీయ పార్టీలు. ఈ రెండు సభల సభ్యులూ ప్రత్యక్షంగానే ఎన్నికవుతారు. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో వున్న 435 మంది సభ్యులు ఒక్కో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. వంద మంది సెనేటర్లు ఆరు సంవత్సరాలపాటు తమ సేవలందిస్తారు. ప్రతి రాష్ట్రంలోను ఇద్దరు సెనేటర్లుంటారు. ఇది కూడా ఆ రాష్ట్ర జనాభాను బట్టి వుంటుంది. చట్టపరమైన అంశాలను రూపొందించడంలో ఈ రెంటికీ సమాన భాగస్వామ్యం వుంటుంది. అయితే రాజ్యాంగం ప్రతి సభకు కొన్ని ప్రత్యేకాధికారాలను కల్పించింది. వాషింగ్టన్ డిసిలో 'కాంగ్రెస్' సమావేశాలు జరుగుతాయి. ప్రస్తుతం నడుస్తోంది 111వ కాంగ్రెస్. ఇది జనవరి 2009 జనవరి 6వ తేదీన ఏర్పడింది.

విజ్ఞాన వేదిక

ఎడిసన్ బల్బుకి వీడ్కోలు

- డా॥విజయ్

దాదాపు 130 ఏళ్ల క్రితం విద్యుద్దీపం (బల్బు) మానవేతిహాసంలో ఒక మహాద్భుతం. థామస్ అల్వా ఎడిసన్ (1847-1931) బల్బుని ఆవిష్కరించిన వ్యక్తిగా ప్రపంచానికి తెలిసినా, ఆయన కంటే ముందే, 1800 సంవత్సరంలో హంఫ్రీ డేవీ మొట్టమొదటి విద్యుత్‌కాంతిని కనుగొన్నాడు. మరో అరవై ఏళ్ల తరువాత, జోసఫ్ విల్సన్ స్వాన్ అనే ఆయన దీర్ఘకాలం వెలిగే విద్యుత్ దీపాన్ని కనుగొన్నాడు. ఆయన 1878 లో తన కొత్త విద్యుద్దీపాన్ని ఇంగ్లాండులో ప్రదర్శించాడు కూడా! ఎడిసన్ 1879లో ప్రాణవాయువు లేని వాతావరణంలో కార్బన్ ఫిలమెంటు దాదాపు 40 గంటలు 'వెలుగు'తుందని కనిపెట్టాడు. ఆ తరువాత ఆయన 1500 గంటల వరకూ వెలిగే బల్బుని తయారు చేశాడు. ఆ తరువాతి శతాబ్దంలో, 1910లో, విలియమ్ డేవిడ్ కూలిడ్జ్ అనే ఆయన టంగ్‌స్టన్ ఫిలమెంటు మరింత ఎక్కువ కాలం వెలుగుతుందని నిరూపించాడు. ఆనాటి నుండి ఇప్పటివరకూ ఇన్‌కాండిసెంట్ బల్బు (ఫిలమెంటు బల్బు) ప్రపంచానికి వెలుగు పంచుతూనే వుంది.

ఇంతటి దీర్ఘ ఘన చరిత్ర వున్న సుపరిచితమైన బల్బుకి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. ఆ మాటకొస్తే ఇప్పటికే చాలా దేశాలు టాటా చెప్పేశాయి కూడా! క్యూబా 2005 లోనే ఇన్‌కాండిసెంట్ బల్బుల దిగుమతులనూ, అమ్మకాలనూ నిషేధించింది. ఇక చాలా దేశాలు రానున్న నాలుగైదేళ్లలో మొత్తానికి బల్బుల వాడకాన్ని దశలవారీగా ఆపే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇంత తీవ్ర నిర్ణయాలకి కారణం? ఈ బల్బులు చాలా చవకగా వున్నా విద్యుత్‌ని మాత్రం ధారాళంగా వాడేస్తాయి. పైగా ఇటీవల మరో సమస్య కూడా ఉత్పన్నమైంది. అది కార్బన్ డయాక్సైడ్. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న 'గ్లోబల్ వార్మింగ్' అవగాహన వల్ల కార్బన్‌డయాక్సైడ్ విడుదల చేసే చర్యలను, వేడిని, ఉత్పత్తి చేసే చర్యలని క్రమక్రమంగా తగ్గించుకోవడం ప్రారంభమైంది. అదే క్రమంలో విద్యుత్ బల్బుల నిషేధం కూడా ప్రారంభమైంది.

నాలుగేళ్ళ క్రితం ఫైడల్ కాస్ట్రో క్యూబన్లకు కాంపాక్ట్ ఫ్లోరసెంట్ ల్యాంప్ (సిఎఫ్‌ఎల్) లను పంచాడు. విద్యుత్ వాడకపు భారం పెరిగిపోయి తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడే పరిస్థితి ఉత్పన్నం కావడం వల్ల ఇన్‌కాండిసెంట్ బల్బుల బదులు సిఎఫ్‌ఎల్ లను వాడమని ఆయన సందేశం. కాస్ట్రో చర్య విజయవంతమైన ఫలితాలనిచ్చింది. అదే స్ఫూర్తితో వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ తన దేశంలో ఇంటింటికీ సిఎఫ్‌ఎల్ లను పంపిణీ చేసేందుకు కాస్ట్రో సిబ్బందిని కోరాడు. ప్రస్తుతం పనామా కూడా 'ఆపరేషన్ బాంబిల్లో' పేరిట ఉచితంగా ఆరు మిలియన్ల బల్బులను మార్చే ప్రణాళిక సిద్ధమైంది - విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడానికి!

ఈ సెప్టెంబరు నుండి 100 వాట్ల బల్బుల వాడకాన్ని యూరప్‌లో నిషేధించనున్నాయి. ఆ తరువాత తక్కువ వాట్ల బల్బును కూడా క్రమక్రమంగా 2012 కల్లా సంపూర్ణంగా నిషేధించబోతున్నారు.



ఇటీవలి కాలంలో కాస్త ప్రాచుర్యం పొందిన సిఎఫ్‌ఎల్ లు ముందుగా కాస్త ఖరీదే అయినా, ఎక్కువకాలం మన్నిక, తక్కువ విద్యుత్ వినియోగం వల్ల మంచి లాభాలూ ఇస్తాయి. పదకొండు వాట్ల సిఎఫ్‌ఎల్ ఇచ్చే ప్రకాశం మామూలు 60 వాట్ల బల్బుతో సమానం. పైగా సిఎఫ్‌ఎల్ తో 80 శాతం విద్యుత్‌శక్తి ఆదా అవుతుంది. దీనికి తోడు మామూలు బల్బుల కంటే 5 నుండి 15 రెట్లు దీర్ఘ మన్నిక వల్ల అవి అన్నివిధాలా లాభదాయకమే.

అయితే అన్ని సిఎఫ్‌ఎల్ లూ ఇంత లాభసాటిగా ఉండకపోవచ్చు. నాసిరకం సిఎఫ్‌ఎల్ లు మామూలు బల్బుల కంటే ఎక్కువ శక్తినే కాజేస్తాయని తేలింది (నాసిరకం, చవకబారు సీలింగ్ ఫ్యాన్లు, మిక్సీల లాగా).

ఇన్‌కాండిసెంట్ బల్బులు కాంతితో బాటు వేడినీ వెదజల్లుతాయి. తద్వారా విద్యుత్ వాడకం పెరిగి, విద్యుదుత్పాదనపైభారం అధికమౌతుంది. ఫలితంగా వాతావరణంపై ప్రత్యేకించి పర్యావరణంలో అవాంఛనీయ మార్పులు సంభవిస్తాయని నిపుణులు అంటున్నారు. చల్లని, తెల్లని కాంతి ప్రసరించే ఫ్లోరసెంటు లైట్లు, ట్యూబ్‌లైట్లు, సిఎఫ్‌ఎల్ లు కూడా మరో రకంగా హానికరమే అంటున్నారు. సదరు ఫ్లోరసెంటు లైట్లలో పాదరసం పూత వుంటుంది. పైగా అల్ట్రావైలెట్ కిరణాల వుత్పత్తికి, తద్వారా కాంతి విడుదలకూ పాదరసం అవసరం. ఆ విధంగా వాతావరణంలోకి హానికర పాదరసం విడుదలవ్వడం వల్ల ఇవి కూడా పర్యావరణ మిత్రులు కాదంటున్నారు.

అయితే రాను రాను సిఎఫ్‌ఎల్ లు నాణ్యత కూడా మెరుగౌతోంది. మామూలు బల్బు సగటున 100 గంటల తరువాత 'మాడి' పోతే, నాణ్యమైన (ఖరీదైన) సిఎఫ్‌ఎల్ 6 లక్షల ఆన్-ఆఫ్- లను తట్టుకుని నిలబడతాయి.

వీటికి తోడు రాబోయే రోజుల్లో ఎల్ఇడి లైట్లు రాజ్యమేలే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ లైట్ ఎమిటింగ్ డయోడ్ బల్బులు సుమారు లక్ష గంటల వరకూ పనిచేయగలవు. అంటే నిర్విరామంగా పదకొండు ఏళ్ళ వాడకమన్నమాట! లేదా ఇరవైరెండేళ్లపాటు సగం రోజు వాడకంతో సమానం! పైగా ఎల్ఇడిలు మామూలు బల్బుల కన్నా 80శాతం నాణ్యమైన కాంతినిస్తాయి. అయితే ఎల్ఇడిలు ఖరీదెక్కువ. మామూలు బల్బు 10 రూపాయలైతే, సిఎఫ్‌ఎల్‌లు వంద రూపాయలు. కానీ ఎల్ఇడిలు దాదాపు 1500 రూపాయల స్థాయిలో ఉంటాయి. కానీ వీటి తయారీ ధరను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మొత్తానికి మనకు అత్యంత చిరపరిచితమైన బల్బు ఇప్పుడో ఇకముందో అంతరించబోతోంది. వాస్తవానికి దాని నిష్క్రమణ అవసరం కూడా. విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలనే అవగాహన, పొదుపుగా విద్యుత్ పరికరాల వాడకం వంటి వాటితో బాటు ఇలా సిఎఫ్‌ఎల్‌లకూ మారడం ప్రస్తుత కర్తవ్యం.

సాంకేతిక పరిజ్ఞానం పురోగమిస్తున్నకొద్దీ కొత్త వెసులుబాట్లు వెలికి వస్తున్నాయి. వాటిని మనం అందిపుచ్చుకుంటూ పర్యావరణ పరిరక్షణకు మన వంతు సాయం చేయాలి.

★

ఆ బల్బు వందేళ్లపైగా వెలుగుతూనే వుంది

కాలిఫోర్నియాలోని లివర్‌మోర్‌లో ఒక అగ్నిమాపక కేంద్రంలో ఒక 4వాట్ల ఇన్‌కాండిసెంట్ బల్బు వెలుగుతోంది. ఎప్పటి నుండి? -1901 నుండి. దాదాపు నిరంతరాయంగా! కేంద్రం మరో బిల్డింగుకు మారినప్పుడూ లేదా విద్యుత్తులో అంతరాయాలొచ్చినప్పుడో తప్పితే, ఆ బల్బు ఇంతవరకూ మార్చబడలేదు. కొన్ని సంవత్సరాల క్రితం కొంతమంది ఔత్సాహికులు ఒక వెబ్ కెమెరాను అమర్చి, ఈ బల్బు ఎప్పుడు 'మాడు'తుందో రికార్డ్ చేద్దామనుకున్నారు. వెబ్‌కామ్‌ను అమర్చారు కూడా. కానీ మూడేళ్ల తరువాత వెబ్‌కామ్ కాలిపోయింది. 1901 బల్బు వెలుగుతూనే ఉంది!



నూరేళ్ల శ్రీశ్రీ...

మహాకవి శ్రీశ్రీ శతజయంతి(1910-2010) ఉత్సవాలు మరే ఆధునిక తెలుగు కవికి, రచయితకు జరగనంత ఘనంగా విస్తృతంగా జరుగుతున్న సందర్భం. జూన్ 15 ఆయన వర్ధంతి.

శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30 న విశాఖపట్టణంలో పుట్టారు.తండ్రి వెంకటరమణయ్య లెక్కల మాష్టారు.తల్లి అప్పలకొండమ్మ. కొడుకు పుట్టాక ఆర్నెల్లకే ఆమె చనిపోయారు. తనను ఎందరో తల్లులు స్తన్యమిచ్చి పెంచారంటాడు ఆయన. తల్లికి చిన్నప్పుడే దూరమైన కారణంగా తనలో ప్రేమ పట్ల అవిశ్వాసం పెరిగిందని చెబుతాడు. కాని తండ్రి రెండవ వివాహం చేసుకున్న సుభద్రమ్మ అంటే ఆయనకు ఎంతో ప్రేమ, గౌరవం.సవతి తల్లిని రాక్షసి అని తిట్టిపోసేవారిని ఆయన తీవ్రంగా విమర్శిస్తూ తనకు తెలిసిన తల్లి ఆమే నంటాడు.

- తెర

ఈ కారణాలన్నిటి వల్ల శ్రీశ్రీ సాహిత్యంలో మరీ ముఖ్యంగా మహాప్రస్థానంలో అడుగడుగునా మాతృస్పర్శ తొంగిచూస్తుంది. ఒక విధంగా ఇది మాగ్జిం గోర్కి పాత సమాజాన్ని అమ్మగా చిత్రించడం వంటిదే. అలాగే శ్రీశ్రీ కూడా కవిత్వాన్ని రసధుని,మణిఖని, జననీ కవితా ఓ కవితా అని సంబోధిస్తాడు. 'నా జనని గర్భంలో ఆకారం లేకుండా నిద్రిస్తున్న నా అహంకారానికి ఆకలి గొల్పిననాడో' అని మరో చోట చెబుతాడు. మరో ప్రపంచం భావననే 'పుడమి తల్లికి పురిటినొప్పులు' అని కొత్త ప్రపంచం కోసం జరిగే పోరాటాన్ని అభివర్ణిస్తాడు. నడిరే నిద్దురలో అపుడే ప్రసవించిన శిశువు నెడదనిడుకొని రుచిర స్వప్నాలను గాంచే జవరాలి మన:ప్రపంచపు టావర్తం' అంటాడు. బాటసారి గేయంలో అతన్ని గురించి చెప్పిన ప్రతిసారి పల్లెటూళ్లో తల్లిని కూడా సమాంతరంగా వర్ణిస్తూ ఒక కరుణార్ద్రరస చలన చిత్రం చూస్తున్న అనుభూతి కలిగిస్తాడు.

శ్రీశ్రీకి ముందు కూడా తెలుగులో ప్రజాచైతన్య స్ఫోరకమైన కవితలు, పాటలు వున్నా ఆయన వైతాళికుడు కావడానికి కారణాలు అనేకం. స్వతహాగా మహా ప్రతిభావంతుడు. ఆపైన సాహిత్యసంప్రదాయాలున్న కుటుంబం. ఏది అడిగినా అందించే తండ్రి. ఆ విధంగా బాల్యంలోనే సాహిత్య సంపర్కం కలిగింది. నాటకాలలోనూ వేషాలు వేశాడు. చిన్నప్పుడే నవల రాశాడు. చిత్రకళ అభ్యసించాడు. సంప్రదాయ కవిత్వంలో మునిగితేలి సామ్యవాదం వైపు నడిచాడు. ఆ క్రమంలో దేశ దేశాలకు చెందిన అత్యాధునిక కవిత్వ పోకడలను ఆకళింపు చేసుకున్నాడు. మొదట సకల సంపదలూ అనుభవించిన కుటుంబం దారిద్ర్యంలో కూరుకుపోవడం వల్లనూ. తీవ్రమైన అనారోగ్యం వల్లనూ ఆయన జీవితపు ఆటుపోట్లు అనుభవించాడు. ఈ అంశాలన్ని కలగలసి ఆయన అనుకున్న భావాన్ని సరికొత్తరీతిలో అక్షరీకరించగల శబ్దబ్రహ్మగా అవతరించాడు. తనకు ముందున్న వారికి లేని విశిష్టతను, విలక్షణతను సంతరించుకోగలిగాడు.

శ్రీశ్రీ 1918లోనే ఒక కంద పద్యం, 'గోకులాయి' అనే డిటెక్టివ్ నవల రాశాడు.1920లో 'వీర నరసింహరాయలు' అనే నవల రాశాడు. 1922లో 'సావిత్రీ సత్యవంతులు' పద్య నాటకం రాశాడు. 1924లో ఆయన నవల 'పరిణయ రహస్యం' అచ్చయింది. అదే ఏడాది ఆయన ఎంతగానో ప్రేమించే పినతల్లి సుభద్రమ్మ మరణించారు. కుటుంబాన్ని దారిద్ర్యం చుట్టు ముట్టింది కూడా అప్పుడే.మరుసటి ఏడాది అంటే పదిహేనో ఆయనకు వెంకటరమణమ్మతో పెళ్లి జరిగింది.అది కూడా చాలా హడావుడిగానూ గందరగోళంగానూ జరిగింది.

శ్రీశ్రీకి మొదటి నుంచి సాహిత్య సృజనకే పరిమితం కాకుండా సాహిత్యమిత్రులతో కలసి సాహిత్య సంఘాలు ఏర్పర్చడం కూడా చాలా ఇష్టమైన పని. ఆయన పురిపండా అప్పలస్వామితో కలసి 1926లో కవితా సమితి స్థాపించారు.1928లోనే ఆయన తొలి ఖండ కావ్యం ప్రభవ అచ్చయింది. అందులో సంప్రదాయ ముద్రతో పాటు కొత్తదనపు ఛాయలూ ప్రస్ఫుటమయ్యాయి.1928-30 మధ్య మద్రాసులో బిఎ చదువుతున్నప్పుడే ఆయనకు కొంపెల్ల జనార్ధనరావుతో సహా అనేక మంది సాహితీ మిత్రులు, ప్రముఖుల పరిచయం కలిగింది.1929లో సుప్తాస్తికలు(నిద్రించే ఎముకలు) గీతంలోనే తొలిసారి పీడితుల వేదనా స్వరాలు వినిపించడం మొదలైంది.

1930లో శ్రీశ్రీ 63 రోజులపాటు టైఫాయిడ్ తో పెనుగులాడాడు. అది ఆయనను శారీరకంగానే గాక మానసికంగానూ చాలా ఘర్షణకు గురి చేసింది.కొత్త భావాలకు అంకురార్పణ జరిగింది. 1931-33 మధ్య ఏవిఎస్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగం చేస్తూనే సాహిత్యం విస్తృతంగా అధ్యయనం చేశాడు. అప్పటి వరకూ తనను అమితంగా ప్రభావితం చేసిన దేవుల పల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణల వరవడి నుంచి బయటపడ్డాడు. 1933లో 'జయభేరి' గీతంతో మహాప్రస్థానానికి నాంది పలికాడు. 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అంటూ మొదలయ్యే ఈ గీతం సమాజానికి వ్యక్తికి మధ్య వుండవలసిన సంబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. పైగా ఈ వాక్యం ద్వారా ఆయన కేవలం అగ్రవర్ణాల వారే గాక ఎవరైనా హోమానికి సమిధ కావచ్చన్న భావనను ప్రవేశపెట్టాడు. ఈ గీతం మూడు భాగాలుగా వుంటుంది. మొదట గతం, రెండవది వర్తమానం, మూడవది భవిష్యత్తు... 'నేను సైతం భువన భవనపు బావుటానై పైకి లేస్తాను' అంటూ ముగించడం 'సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అన్న దానికి భిన్నంగా ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ గీతంలోనే శ్రీశ్రీ తొలిసారి 'గబ్బిలం' ప్రస్తావన కూడా చేశాడు. ఉత్తరోత్తరా జాషువా 'గబ్బిలం'పైనే కావ్యం రాశాడు.

మహాప్రస్థానంలో గేయాలన్ని జన ప్రియమైనవే. వాటి చూపూ వూపూ రూపూ లోతుపాతులు చాలా విధాలుగా విశ్లేషించుకున్నవే. పతితులూ భ్రష్టులను

ఏడవకండని భరోసా ఇచ్చి జగన్నాథ రథ చక్రాలొస్తున్నాయని ధైర్యం చెప్పి 'పదండి ముందుకు' అంటూ కదం తొక్కించి కనబడలేదా ఎర్రబావుటా నిగనిగలు చూపించిన 'మహా ప్రస్థానం' తెలుగు భాషా సాహిత్యాలను కొత్త మలుపు తిప్పింది. అర్థాలూ పరమార్థాలూ మార్చేసింది. దగా పడిన తమ్ముడు, కదం తొక్కుతూ పదం పాడుతూ, కాదేదీ కవిత కనర్హం,కదిలేదీ కదిలించేదీ, ప్రపంచమొక పద్మవ్యూహం, ఆ పాపం ఎవ్వరిది, ఏమున్నది గర్వకారణం, దాచేస్తే దాగని సత్యం, ఇతిహాసపు చీకటి కోణం, ఇంకానా ఇకపై చెల్లదు, ఉరితీయబడిన శిరస్సు, ఎముకలు కుళ్లిన, వయస్సు మళ్లిన .. ఇత్యాది ఎన్నెన్నో పదబంధాలను అందించింది. పదాలకు అర్థం మార్చింది. శ్రీశ్రీని శబ్దబ్రహ్మను చేసింది.

అయితే ఈ దశకు చేరడానికి శ్రీశ్రీ నిజంగానే మహాప్రస్థానం చేశాడు. తనకు స్ఫూర్తి నిచ్చిన కృష్ణశాస్త్రి, విశ్వనాథ వంటివారిని భావ పరంగానే గాక ప్రసిద్ధిలోనూ అధిగమించాడు. కారణం ఆయన ప్రజలతో ప్రగతితో నిలబడ్డమే. చివరకు కృష్ణశాస్త్రి కూడా ఈ ప్రభావాన్ని తప్పించుకోలేక తన వూహా ప్రేయసి కోసం ఏడ్చే తన సహజ శైలిని పక్కన పెట్టి 'ఆకాశము నుదుట పొడుచు అరుణారుణ తార' అని రాయవలసి వచ్చింది. విశ్వనాథ తిరోగమన భావాలను శ్రీశ్రీ పదే పదే విమర్శిస్తున్నా ఈయన 'కవితా ఓ కవితా' లోని కవిత్వ సాంద్రతకు కదలిపోయిన విశ్వనాథ అక్షరాలా ఆలింగనం చేసుకుని అభినందించారు. ఇవన్నీ శ్రీశ్రీ ప్రతిభను చెబుతాయి. స్విన్‌బర్న్,ఎడ్గార్ ఎలెన్ పో తదితర అనేక మంది పాశ్చాత్య కవులనూ ఆయన అంతే పట్టుగా చదివాడు. ఆ దేశాలకు వెళ్లినపుడు వారి కవితలు వారి ముందే తుచ తప్పకుండా అప్పజెప్పి ఆశ్చర్య పర్చాడు.

మహాప్రస్థాన గీతాలు మొదట్లో ఆదరణ పొందలేదు. సావిత్రిని నటిగా పనికిరావని తిరస్కరించినట్టే శ్రీశ్రీ గీతాలను కూడా అప్పటి ప్రముఖ సాహిత్య పత్రికలు వెనక్కు పంపించాయి! అయితే అచ్చయిన తర్వాత మాత్రం అవి గొప్ప సంచలనం కలిగించాయి.పుస్తకంగా అచ్చు వేసుకునే శక్తి శ్రీశ్రీకి లేకపోవడంతో దాదాపు పదిహేనేళ్ల పట్టింది.అప్పుడు కూడా నళినీ కుమార్ అనే మిత్రుడు దాన్ని తీసుకొచ్చాడు. తర్వాత కాలంలో కమ్యూనిస్టు ప్రచురణ సంస్థగా విశాలాంధ్ర దాన్ని తీసుకువస్తున్నది.

శ్రీశ్రీ అంటే 'మహాప్రస్థానం' గుర్తుకు వస్తుంది గాని నిజానికి ఆయన విస్తృత రచనా వ్యాసంగం అనేక రూపాల్లో కొనసాగిస్తూనే వచ్చాడు. అవి ఇరవై సంపుటాలుగా విరసం ప్రచురించింది. వాటిలో వ్యాసాలు కవిత్వం కన్నా ఏమాత్రం తీసిపోని శైలితో కదం తొక్కిస్తాయి. వ్యంగ్య ప్రయోగాల్లో ఆయన అందె వేసిన చేయి. తర్వాత కాలంలో ఈ ధోరణిలోనే 'మూడు యాభయిలు' రాశాడు.

శ్రీశ్రీ కవి మాత్రమే కాదు. జర్నలిస్టు కూడా. ఆంధ్రప్రభ,ఆనంద వాణి వంటి పత్రికల్లో ఉద్యోగం చేశాడు. కమ్యూనిస్టు పత్రికలను నిరంతరం ప్రోత్సహిస్తూ రచనలు అందిస్తూ వచ్చారు. ఇవే గాక జీవితంలో మధ్య మధ్య ఇంకా అనేక వుద్యోగాలు చేశాడు.

శ్రీశ్రీ సినిమా జీవితం కూడా చాలా సుదీర్ఘమైంది. 1949లో 'ఆహుతి'తో అది ప్రారంభమైంది. 'పాడవోయి భారతీయుడా, తెలుగు వీర లేవరా' వంటి సినిమా పాటలు అందరం చెప్పుకుంటూరు. కాని ఆయన ప్రధానంగా అనువాద చిత్రాల్లో పనిచేశారు. డబ్బింగ్ సామ్రాట్ అనిపించుకున్నారు. ఆ డబ్బింగ్ ప్రక్రియలో తనకు సహాయకురాలిగా వున్న సరోజనే 1955లో రెండవ పెళ్లి చేసుకున్నారు. సంతానం కన్నారు. (మొదటి భార్య వెంకటరమణమ్మ 1973లో చనిపోయారు.) తమిళ భాషతో పరిచయమే కాక పెదవుల కదలికకు అనుగుణంగా తెలుగు పదాలు రాయగలిగిన సామర్థ్యం ఆయనకు మెండు. సినిమా పాటలకు సామాజిక చైతన్యం, వర్గ చైతన్యం సమకూర్చిన వారిలో ఆయన అగ్రగణ్యుడు. ఇదేగాక తెర వెనక కూడా సినిమాలకు సమాచారం అందించడంలోనూ, సంవిధానాన్ని సూచించడంలోనూ ఆయన చాలామందికి సహాయపడ్డారు. రచయిత అయినప్పటికీ రాబోయే కాలం సినిమా మీడియాదేనని నమ్మి దానిపై విస్తారంగా రాశారు.

మహాకవి స్థానం అలంకరించి కూడా కష్టభూయిష్టమైన కమ్యూనిస్టు ఉద్యమంతో కలసి నడిచిన ఆశయ నిబద్ధత శ్రీశ్రీది. ఈ విషయంలో ఆయనతో పోల్చదగిన వారు మరొకరు కనిపించరు. 1955లో హోరాహోరీగా జరిగిన మధ్యంతర ఎన్నికల రణరంగంలో శత్రు శక్తుల దుష్ప్రచారాన్నే గాక దాడులకు కూడా గురయ్యారు. మతిస్థిమితం పాలై మళ్లీ నిలదొక్కుకుని మహాప్రస్థానం కొనసాగించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన విభేదాల తర్వాత కూడా ఆయన ఎర్రజండానే అంటిపెట్టుకుని వున్నారు. అరసం విరసం రెండింటిలోనూ కీలక పాత్ర వహించారు.

సోషలిస్టు దేశాలలో విస్తృతంగా పర్యటించారు. సోవియట్ అవార్డు అందుకున్నారు. చైనా వెళ్లి చాలా ఉత్సాహపడి వచ్చారు.

శ్రీశ్రీ పట్ల యువతరంలోనూ చాలా ఆకర్షణ వుండేది. ఆయన ప్రేరణతోనే చాలా మంది కవులయ్యారు. కాలేజీ డేలకు అతిథిగా హాజరైతే జనం విరగబడి వచ్చేవారు. పెద్ద ఉపన్యాసకుడు కాదు కాని ఈ పర్యటనలతోనూ రచనలతోనూ ఆయన సాహిత్య చైతన్యం పెంచారు. తన తర్వాత వచ్చిన ప్రగతిశీల కవులను గొప్పగా ప్రోత్సహించడం ఆయనలో ప్రత్యేకత.వారిని ఉదారంగా ప్రశంసిస్తాడు.

మాటల్లో విరుపూ మెరుపూ శ్రీశ్రీ సొంతం. ఆయన పేరుతో అనేక చమత్కారాలు హాస్యాలు సాహిత్య లోకంలో స్థిరపడిపోయాయి. ప్రశ్నలు జవాబుల కింద చేసిన చమత్కారాలు గాని, ప్రాస క్రీడలు గాని బాగా ప్రసిద్ధి.

శ్రీశ్రీ స్నేహితులను అమితంగా ప్రేమించాడు. కీర్తిశేషుడైన కొంపెల్ల జనార్థనరావుకు తన మహాప్రస్థానం అంకితం ఇవ్వాలని మొదటే నిర్ణయించుకున్నాడు.

చాలామంది కవులు కళాకారుల లాగే మద్యపాన వ్యసనం వున్న శ్రీశ్రీ దానివల్ల ఆర్థికంగానూ ఆరోగ్యపరంగానూ చాలా నష్టపోయాడు. అయితే జీవితం చివరి దశలో వైద్యుల సలహా మేరకు దానికి పూర్తి దూరంగా వుండిపోయారు. ఆర్థికంగా అనేక కష్టాలు పడినా మేధస్సును పాలకవర్గాలకు తాకట్టు పెట్టేందుకు సిద్ధపడలేదు. చివరకు 1983 జూన్ 15న కన్నుమూశారు. కాని లాభం లేదు నేస్తం నీ ప్రాభవం మమ్ముల్ను వదలిపెట్టడం లేదు, నిరుత్సాహాన్ని జయించడం నీ వల్లే నేర్చుకున్నాము అని కొంపెల్ల జనార్థనరావును ఉద్దేశించి ఆయన అన్నట్టే శ్రీశ్రీ ప్రభావం ప్రేరణ కొనసాగుతూనే వున్నాయి. చలం చెప్పినట్టు మరో ప్రపంచ నిర్మాణం కోసం సాగిపోయే వారికి ఆయన కవిత్వం మార్చింగ్ బాండ్‌లాగా చిరస్మరణీయమై నిల్చిపోయింది.

★





క్రైమ్ కథ

మిస్సింగ్

- యర్నాగుల సుధాకరరావు

ఇంట్లో నిద్రపోయినవాడు తెల్లారేసరికి ఏమయ్యాడు? ఆగ్రామంలో ఒక్కడు పెదవి విప్పడంలేదు.రాజయ్య ఆత్మహత్య చేసుకోడు. అతడికి ఎలాంటి ఇబ్బందులు లేవు. పిరికివాడు కాడు. గ్రామంలో ఎవరితో తగవుల్లేవు. మరి కన్పించకుండా పోయాడంటే కానేకాదు. ఆరాత్రి గ్రామ రచ్చబండ వద్ద అందరితో బాటు రాత్రి పదిన్నర వరకు ఉన్నాడు. ఏదో జరిగింది. గ్రామంలో అందరిని ప్రశ్నించాం.రాజయ్య బలమైన రాజకీయ వర్గానికి చెందినవాడు.మంత్రులు పదేపదే అడుగుతున్నారు. కన్పించకుండాపోయి నెలరోజులవుతోంది" పోలీసులమధ్య రాజయ్య మిస్సింగ్‌కేసు చర్చ కొన్ని గంటలు సాగింది.

ఒక కానిస్టేబుల్ లోపలకి వచ్చి "సార్ మిస్సింగ్‌కేసు నమోదైన రాజయ్య గ్రామంలో చిన్న యాక్సిడెంటు అయ్యింది. ఒకపెద్దావిడకు ఆటోలోంచి కిందపడి గాయాలయ్యాయి. కేసు పెట్టాం. ఆసుపత్రిలో పెద్దావిడను ఎడ్మిట్ చేసాం.ప్రాణాపాయంలేదని చెప్పారు" గబగబా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ తమ చర్చలకు భంగం అయినట్టుగా ఫీలయి "చిన్న యాక్సిడెంటు కేసు నేను అంత అర్జంటుగా వినాలా లేకపోతే ఆముసల్డి చచ్చిపోతుందా? ఇక్కడ ఇద్దరు యస్.ఐ.లతో అత్యవసరంగా మాట్లాడుతున్నాను" ఆ కానిస్టేబుల్‌మీద రుసరుసలాడాడు.

"సార్ ఆసుపత్రికి ఆగ్రామం అంతా కదిలి వచ్చింది. మనకి ఏమైనా క్లూ దొరుకుతుందని చెప్పాను" తను చేసింది కరక్టు అన్నట్లుగా వివరణ ఇచ్చేసి వెళ్లిపోయాడు కానిస్టేబుల్.

ఇన్‌స్పెక్టర్‌కు ఎందుకో ఆ వివరణ నచ్చింది. వెంటనే లేచాడు. ఇద్దరు కానిస్టేబుల్సును వెంటపెట్టుకుని బయల్దేరాడు. ముగ్గురు వేన్ ఎక్కారు. అప్పుడే మంత్రిగారి ఫోన్ "ఏమయ్యాడు మారాజయ్య. అసలు భూమిమీద ఉన్నాడా? లేకుంటే ఎవరైనా చంపేసారా? ఏదీ తేల్చకుండా ఏమిటి ఈనాన్చుడు ధోరణి?నాకు ఒకటిరెండురోజుల్లో రాజయ్య విషయం చెప్పకపోతే ఊరుకునేది లేదు" చెప్పి పెట్టేసాడు.

ఇన్‌స్పెక్టర్ ఆసుపత్రికి వచ్చేవరకు ఏమి మాట్లాడలేకపోయాడు. మానసికంగా ఒకింత వేదనకు గురయ్యాడు. రాజయ్య మిస్సింగ్‌కేసు నెలరోజులుగా ఏపనీ చేయనీయడంలేదు.గ్రామాల్లో ఉంటూ పెద్దనాయకత్వ బిల్డప్‌లతో ఇలాంటి రాజయ్యలుంటారు.మినిస్టర్ ఏకంగా రాజయ్య ఉన్నాడా చంపబడ్డాడా అని అడిగాడు.అదే వేరెవ్వడు అడిగినా చంపబడ్డాడా అని ఎందుకు అడిగావు అని ఇంటరాగేట్ చేసేవాళ్లం మంత్రులకు చేయలేం" ఆలోచించుకుని పెదవి విరిచాడు.

ఆసుపత్రి ఆవరణలో వాన్ ఆగింది సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు కిందకి దిగారు.ఇన్‌స్పెక్టర్ అక్కడక్కడ కన్పిస్తున్న గ్రామీణులను చూసాడు.వారు ఏదో పనిపడి పట్టణం వచ్చి ఊరులో ఉండే పెద్దావిడకు యాక్సిడెంటు కదా చూసిపోదామని వచ్చి వెళ్లిపోతున్నారు.

> "పొలంవద్ద నీటిగురించి ఈచెంచయ్యతో ఆరాత్రి వాదించాడు చెంచయ్య తగవులు మనిషికాడు. ప్రతిఏటా నాపొలం నీ వలనే పండడంలేదు. ఇక ఆదేవుడే నీకు ఏదో రోజు బుద్ధి చెప్తాడు అనేసి తలుపులేసుకున్నాడు. నాయనా ఆటోలోంచిపడడంపై కోర్టులో పెట్టవద్దు కోర్టులకు తిరగలేను."

ఇన్‌స్పెక్టర్‌ను చూడగానే పంచాయితీ మెంబర్ వచ్చి "సార్ మారాజయ్య కేసు ఏమయ్యిందిసార్? ఆమధ్య మంత్రిగారు మాగ్రామం వచ్చి పరామర్శించారు.కేసు తేలకపోతే ఊరుకునేదిలేదు. పోలీసులు మెతకవైఖరి కడిగేస్తాను అని కోపంతో చెప్పి వెళ్లారయ్యా !" అని చెప్పాడు.

పోలీసులు బిత్తరగా చూశారు.ఇన్‌స్పెక్టర్ తల విదిలించి "సరే ఇప్పుడు యాక్సిడెంటు అయిన పెద్దావిడ పరిస్థితి ఏమిటి?పర్వాలేదా?"

"పర్వాలేదు.ఆమె పొలాలు కౌలుకు చేస్తున్నవారు మాత్రం ముఖం చాటేశారు. ఆమె పొరుగిళ్లలో ఉండే చెంచన్న మందులకు ఖర్చుపెడుతున్నాడు. ఇది మాఊరి వారి తీరు" చెప్పి వెళ్లిపోయాడు.

"సార్ వెనక్కి వెళ్లిపోదామా?" యస్.ఐ.లలో ఒకరు అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ ఆసుపత్రిలోకి వెళ్లాడు.పెద్దావిడ ఉండే వార్డులో ఆమె ముందు నిలబడ్డాడు. అక్కడ చెంచయ్య ఇన్‌స్పెక్టర్‌ను చూడగానే కళ్లుపెద్దవి చేసాడు. "రండి సార్ ఈమెకు ఏమీకాదు" అని డాక్టర్ చెప్పారు. మందులు బయటినించి కొని తెచ్చాను.సర్దుకుంది. రెండ్రోజుల్లో డిశ్చార్జి చేస్తారంట" అడగకుండానే చెప్పాడు. బెడ్‌మీద పడుకున్న ఆమె చేతులు జోడించింది.

"నాయనా మళ్లీ బతికి బట్టకట్టాను.నాకంటూ ఎవరూ లేరు. ఉన్న భూములు చేస్తున్నవారు చూసి వెళ్లారు కానీ, మందులు కొనిద్దామని లేదు.నాపొరుగింట్లో ఉన్న ఈచెంచయ్య అన్నివిధాల చూస్తున్నాడు.ఏదో పొలమో పుట్టో అమ్మేసి ఇచ్చేయాలి" అని గొణిగింది.

"మీఎదురింట్లో రాజయ్య ఉండేవాడు.అతడు ఏమయ్యాడో నీవేమైనా విన్నావా?"

"రాజయ్య ఎటో వెళ్లిపోయాడని అంతా అనుకుంటున్నారు. వాడు మంచోడే. పొలంవద్ద నీటి గురించి ఈచెంచయ్యతో ఆరాత్రి వాదించాడు. చెంచయ్య తగవులు మనిషికాడు.ప్రతిఏటా నాపొలం నీ వలనే పండడంలేదు.ఇక ఆదేవుడే నీకు ఏదో రోజు బుద్ధి చెప్తాడు అనేసి తలుపులేసుకున్నాడు.నాయనా ఆటోలోంచి పడడంపై కోర్టులో పెట్టవద్దు కోర్టులకు తిరగలేను."

చెంచయ్యను పరిశీలనగా చూసాడు ఇన్‌స్పెక్టర్. అతడు బత్తాయిలను గ్లాసులో పిండుతూ మధ్యలో పోలీసులను చూసే చూపులో ఏదో తేడా గమనించి ఇన్‌స్పెక్టర్ అతడిని ఒకగంట తరువాత చడీచప్పుడు లేకుండా వాన్ ఎక్కించుకుని ఠాణాకు తీసుకుపోయి ప్రశ్నించారు.తొలుత కాదన్నా చివరకి ఒప్పుకున్నాడు. ఆరాత్రి రాజయ్య ఇంట్లో ఒక్కడే పడుకున్నాడు. అతడి కుటుంబం వేరే ఊళ్లో పెళ్లికి వెళ్లారు. ప్రతిఏటా నాకున్న పొలానికి నీరు ఇవ్వడానికి రాజయ్య ఒప్పుకోనందునే దిగుబడి తక్కువగా వచ్చేది. ఇలా ఎన్నాళ్లు అని ఆరాత్రి వాడిని కత్తితో పొడిచి చంపేసి వాడి ఇంటి వెనుక తోటలో నిలువు గొయ్యితీసి పాతేసాను. అయితే ఎదురింట్లో పెద్దావిడకు ఏదో కొంత తెలుసు. ఆమె పెద్దావిడే కాదు పెద్దింటివారు. బయటికి చెప్పలేదు. అందుకే ఆమెకు ఆసుపత్రిలో సేవలు అందించాను" అని తాను ఎలా చంపింది చెప్పాడు.

ఆవెంటనే శవాన్ని వెలికితీసారు.రాజయ్య మిస్సింగ్‌కేసు కాస్తా హత్యకేసుగా మారిపోయింది.

పెద్దావిడ మాటల్లోనే అంతర్లీనంగా రాజయ్య చెంచయ్య పొలంవద్ద నీటితగవును చెప్పడంవలనే తాను చెంచయ్యను అనుమానించాను అని ఆమె మాటల్లో క్లూ ఉందని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. ★

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్,
హై ద రా బా ద్

మా డబ్బు మాకు రావాలంటే...

మాకు అప్పలు అయినందువల్ల మాకున్న ఎకరం భూమిని ఒక ఫైనాన్షియర్ కొనుగోలు చేశాడు. ఆభూమికి మూడు లక్షల ముప్పైమూడు వేలకు బేరం కుదుర్చుకుని రిజిస్ట్రేషన్ ఆఫీసులో ముప్పైమూడు వేల రూపాయలు మాత్రమే ఇప్పించాడు. మిగతా మూడు లక్షలకు చెక్కు రాసి ఇచ్చాడు. అదే రోజు బ్యాంకులో చెక్కు వేస్తే చెల్లలేదు. ఇదేమని అడిగితే ఒకరోజు... వారం రోజులు... అంటూ నెలలు గడిపి ఇప్పడు డబ్బులిచ్చేది లేదని తిరగబడ్డాడు. మా డబ్బులు మాకు రావాలంటే ఇప్పడు ఏంచేయాలి?

లావణ్య, జహీరాబాద్.

మీరు వెంటనే పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వండి. అతని మీద చీటింగ్ కేసు పెట్టొచ్చు. మీరు ఆ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయమని కోర్టులో దావా వేసుకుని రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయవచ్చు. 138 ఎన్.ఐ యాక్టు కింద చెక్కు బౌన్సు చేసినందుకు కేసు వేయవచ్చు. అంతేకాక వడ్డీతో సహా డబ్బులు వసూలు చేయడం కోసం 'మనీ రికవరీ' దావా వేసి మీ డబ్బులు రాబట్టుకోవచ్చు.

మెంటల్ అని ఉద్యోగంలోంచి తీసేస్తారా?

నేను టీచర్‌గా పనిచేస్తున్నాను. నా భార్యతో విడిపోయి పది సంవత్సరాలయింది. ఇప్పడు ఆమెతో కలుపుతామంటున్నారు. నాకు మెంటల్ ఉందని మా ఆవిడని కాగితం రాసి ఇమ్మంటున్నారు. నా ఎమ్.ఎ మార్కుల లిస్టు ఒకటి మా గ్రామస్తులు చింపేశారు, రెండవది ఎస్. కోటలో పోయింది. దీన్ని కూడా మెంటల్ అంటున్నారు. చివరికి నాకు మెంటల్ అని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారికి కూడా రాస్తామంటున్నారు. అధికారులను అడిగితే ఉద్యోగంలో నుండి తీసి వేస్తామంటున్నారు. నేను ఏం చేయాలి?

ఎల్. సాయికృష్ణ, లక్కవరపు కోట, విజయనగరం.

మీరు డిప్రెషన్లో ఉన్నట్టున్నారు. ఒంటరిగా వుండడంతో ఇంకాస్త భారంగా ఉంటున్నట్లున్నారు. మీ సహోద్యోగులతో, అధికార్లతో సత్సంబంధాలు నెరపడం చాలా మంచిది. మీ భార్యతో రాజీపడి సమస్యలుంటే పరిష్కరించుకోవడం మీకు మంచిది.

మీకు మెంటల్ అని మీ భార్య రాసి ఇచ్చినంత మాత్రాన అది చట్టపరంగా సరిపోదు. మెడికల్ బోర్డు, న్యాయమూర్తి ముందు బయానా ఇచ్చి తద్వారా మెజిస్ట్రేట్ ఉత్తర్వుల ద్వారా మెంటల్ అని డిక్లేర్ చేయవలసి ఉంటుంది. మీ సమస్యకు ఎవరినైనా ప్రత్యేక వైద్య నిపుణులను కలవండి. స్వాంతన ఉంటుంది.

బకాయి రాబట్టేదెలా!

మా తండ్రిగారు 2-9-02న కొంత భూమిని తొమ్మిది లక్షలకు అమ్మారు. కొన్నవారు ఐదు లక్షలు ఇచ్చి మిగతా నాలుగు లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. అయితే ఇస్తామని చెప్పిన నాటికి మిగతా బాలన్స్ ఇవ్వకపోగా మూడు లక్షలకు కొన్నట్లు చూపిస్తున్నారు. మాకు మాత్రం భూమి కొన్న తేదీన తొమ్మిది లక్షలకు కొన్నట్లు, ఐదు లక్షలు అప్పడే ఇస్తున్నట్లు, మిగతా నాలుగు లక్షలు రెండు నెలల తర్వాత ఇస్తామని, అట్లా ఇవ్వకుంటే మా భూమిని మాకు స్వాధీనం చేస్తామని పది రూపాయల స్టాంపుమీద రాసి ఇచ్చారు. కానీ అలా చేయలేదు. అందుకు మేము కోర్టులో కేసు వేశాము. రిజీట్‌లో ఉన్న సాక్షులు, అగ్రిమెంటులో ఉన్న సాక్షులు ఒక్కరే. కావున రిజీట్ రద్దు అవుతుందీ లేనిదీ తెలియజేయండి.

నజీర్, పీలేరు.

తొమ్మిది లక్షలకు కొన్నట్లు కాగితం ఉంది కావున ఐదు లక్షలు ఇచ్చి, మిగతా నాలుగు లక్షలు ఇవ్వలేదు. కాబట్టి అట్టి రిజిస్ట్రేషన్ చెల్లనేరదని మీరు కోర్టులో దావా వేసుకోవచ్చు. దాంతోపాటు మీకు డబ్బులే కావాలనుకుంటే డబ్బులు కూడా ఆల్టర్నేటివ్ ప్రేయర్. అదిగానీ లేదా ఇది కానీ(కాన్సిలేషన్ గానీ, డబ్బుగానీ) అడగవచ్చు. పూర్తి డబ్బులు ఇవ్వనిదే మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకొన్నట్లు కోర్టువారు నమ్మితే మీకు ఏదైనా ఒక రిలీఫ్ తప్పకుండా వస్తుంది.

రిజిస్ట్రేషన్ సమస్యతో సతమతమవుతున్నా....

నాదొక సమస్య. 1991లో నేను మా దాయాదుల వద్ద విక్రయ అగ్రిమెంట్ రాసుకుని పాతిక వేల రూపాయలతో భూమికొన్నాను. వాళ్లు అగ్రిమెంట్ ప్రకారం రిజిస్టర్ చేయలేదు. మొత్తం సొమ్ము ఇచ్చినట్లుగా, ఈ భూమికి నేను సర్వ హక్కుదారునిగా రాసి ఇచ్చి ఇక అది నా స్వాధీనం అని చెప్పారు. నేను ఎప్పడు కోరితే అప్పడు రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు కానీ ఇవ్వలేదు. దానిని 1992లో కోర్టులో కేసు వేశాము. మొత్తం ఎగ్రిమెంట్ చేసినవాళ్లు ఎనిమిది మంది. ఒక్కరు కూడా ఇంతవరకు కోర్టుకు రాలేదు. వాళ్లలో ఒకతను కౌంటర్ కేసు వేసి నడుపుతున్నాడు. ఇప్పటికి దాదాపు పదిహేడు సంవత్సరాలయింది. కోర్టులో కేసు వుండగా కౌంటర్ కేసు వేస్తే కోర్టువాళ్లు ఇది అన్ రిజిస్టర్ డాక్యుమెంట్ కావున స్టాంప్ డ్యూ కింద పదహారు వేలు కట్టాను. ఇది ఏవిధంగా అవుతుందో తెలియజేయగలరు.

ఎస్.కె. ఖజార్, పీలేరు, చిత్తూరు.

మీరు స్పెసిఫిక్ దావా వేసి వున్నారు కావున, మీరు స్వాధీనంలో కూడా ఉన్నారు కావున మీ పరంగా తీర్పు తప్పకుండా వస్తుంది. సాదా పేపర్‌పై అగ్రిమెంట్ రాసుకున్నారు కావున వాలిడేషన్ కట్టవలసిందే. మీరు అది కూడా చెల్లించారు కావున కోర్టు మీకనుకూలంగా వస్తుంది. తీర్పు తర్వాత వారు రానట్లయితే మీకు కోర్టువారే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. పదహారు సంవత్సరాలు కేసు పెండింగ్‌లో ఉండడం చాలా అరుదు. మీ విషయంలో ఎందుకలా అయిందో అర్థం కాలేదు. త్వరలోనే పరిష్కారం లభించవచ్చు.

★

కథ

పుట్టిన రోజు

మూగవేదనతో నేను వీధిలోకి చూస్తూ ఉండి పోయాను. చెత్త కుప్పలో పడి ఉన్న దొసె ముక్క కోసం ఇద్దరు కుర్ర బిచ్చగాళ్ళు కొట్టుకుంటున్నారు. నాలోని సర్వశక్తులన్నీ ఏకమై నన్ను బిచ్చమడిగాయి. 'ఓ కప్పు టీ కావాలి' అని! శ్రీ తన సిరిగల పెట్టె క్యాష్‌బాక్స్ తెరిచాడు.



మళయాళీ మూలం : వైకమ్ మహమ్మద్ బషీర్

తెలుగు : డాక్టర్ దేవరాజు మహారాజు

మకరం ప్రవేశించి ఇవాళ్టికి ఎనిమిదో రోజు. ఇవాళే నా పుట్టిన రోజు. రోజుటిలాగా కాకుండా ఇవాళ పెందరాళే నిద్ర లేచాను. కాలకృత్యాలు ముగించుకుని, ఖద్దరు జుబ్బా, ధోవతి ధరించాను. తెల్ల కాన్వాస్ షూ వేసుకున్నాను. బరువైన హృదయంతో పడక కుర్చీలో కూర్చున్నాను. పక్కగదిలో ఉండే మాథివ్స్ నన్ను చూసి ఆశ్చర్యపోయాడు.

"హలో గుడ్ మాణింగ్" అన్నాడు ఇంగ్లీషులో. అతను బి.ఎ. విద్యార్థి.

"యస్. గుడ్ మార్నింగ్" అన్నాను.

"ఏమిటీ వింత? ఇంత పొద్దున్నే తయారయ్యారు? ఎక్కడికైనా వెళ్తున్నారా?" అడిగాడతను.

"లేదు. ఇవాళ నా పుట్టిన రోజు"

"యువర్ బర్తడే?" అడిగాడాశ్చర్యంగా మళ్ళీ ఇంగ్లీషులో.

"యస్" అన్నాన్నేను.

"ఓ... ఐ విష్ యూ మెనీ హాపీ రిటర్న్సు ఆఫ్ ద డే"

"థాంక్యు"

బ్రష్‌తో పళ్ళు రుద్దుకుంటూ మాథివ్స్ స్నానాల గదిలోకి వెళ్ళాడు. చుట్టు పక్కల గోలగోలగా ఉంది. దూరం నుండి ప్రేమ పాటలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు, గుమస్తాలు కలిసి ఉంటున్న లోగిలి అది. వీరిలో ఎవరికైనా మనస్తాపం ఉందా?

జీవితాన్ని నిశ్చింతగా గడిపేస్తున్నారు. నేను మాత్రం ఓ కప్పు టీ ఎలా దొరుకుతుందా అని ఆలోచనలో పడ్డాను. నిన్న బజార్లో హమీద్ కనిపించినపుడు ఇవాళ భోజనానికి రమ్మన్నాడు. అందువల్ల మధ్యాహ్నం భోజనం గురించి ఆలోచించే పనిలేదు. హమీద్ వర్ధమాన కవి. బాగా డబ్బున్నవాడు. కాని, మధ్యాహ్నం దాకా కనీసం టీ అయినా లేకుండా ఎలా ఉండడం? నేను నాగదిలో ఉన్నా మాథివ్స్ వృద్ధ నౌకరు మాథివ్స్ కోసం టీ పెట్టడం నాకు తెలిసిపోతూనే ఉంది. నిజానికి నేనుండేది మాథివ్స్ వంట గదిని ఆనుకుని ఉండే చిన్న సామాను గది. నెలకు అద్దె ఎనిమిది అణాలు. మొత్తం భవనంలో అతిచిన్న గది నాదే. పడక కుర్చీ టేబుల్, షెల్ఫ్ బెడ్డూ, ఫోను మరొకరు ఊపిరి పీల్చడానికిక్కూడా అక్కడ స్థలం లేదు. ఆ కాంపౌండులో అద్దెకు ఉంటున్న వారంతా విద్యార్థులు, చిన్న చిన్న ఉద్యోగస్తులు మాత్రమే. అందరిలోకి మా ఇంటి యజమాని ఇష్టపడని వాడెవడయ్యా అంటే, అది నేనే! ఎందుకంటే నెలనెలా అద్దె సరిగా ఇవ్వను గనుక – నన్ను ఇష్టపడని వారు మరో ఇద్దరున్నారు. ఒకరు హోటల్ యజమాని. రెండు ప్రభుత్వం. అప్పుడైనా హోటల్‌కి ఎంతో కడతాను. కానీ ప్రభుత్వానికి ఏం కడతానూ? నా నివాసం గురించి, తిండి గురించి ఇంత వరకు చెప్పాను కదా! ఇక నేను వేసుకున్న గుడ్డల గురించి, బూట్ల గురించి కూడా చెప్పాలి.

ఇక్కడ మరొక్కమాట రాయడానికంటే ముందు మీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. ఇప్పుడు సమయం అర్ధరాత్రి దాటింది. కలం, కాగితం వదిలేసి లోగడ పట్టణంలో తెగ తిరిగాను. ఇప్పుడు అవే పుచ్చుకుని, గది వదిలేసి దూరంగా ఈ కొలను దగ్గరికి వచ్చాను. వీధి దీపం వెలుగులో కూర్చుని రాస్తున్నాను. అందుకు కారణం గదిలోని దీపంలో చమురు నిండుకుంది. పడుకునే ముందు డైరీ రాయనిది నా దినచర్య పూర్తికాదు. పైగా విషయాలన్నీ మెదడులో తాజాగా ఉన్నపుడే రాసెయ్యాలి.

వర్షించబోయే మేఘంలా, నా హృదయం బద్దలు కావడానికి సిద్ధంగా ఉంది. ఇవన్నీ రోజూ సహజంగా జరిగేవే. కాని, ఈ రోజు నా పుట్టినరోజు. నా ఇంటికి, నా నేలకు నేను ఎంతో దూరంలో ఉన్నాను. చేతిలో డబ్బులేదు. అప్పు పుట్టే ఆస్కారమూ లేదు. నేను వేసుకున్న బట్టలు నా మిత్రులవి. నాదని చెప్పుకోగలది ఏదీ లేదు. పొద్దున మాథివ్స్ 'మళ్ళీ మళ్ళీ రావాలి ఈ రోజు' అని ఇంగ్లీషులో అభినందిస్తుంటే, నాకు కలిగిన బాధ వర్ణనాతీతం. గుండె లోపలి గోడలు చిట్లి పోతున్నట్టు అనిపించింది.

నాకు గుర్తుంది. ఉదయం ఏడు గంటలకు పడక కుర్చీలో వొరిగి కూర్చున్నప్పుడు అనుకున్నాను. కనీసం ఈ రోజైనా ఎవరిని ఏమీ అడగకూడదని. ఎక్కడా ఏ పొరపాటు జరగకూడదని. గతంలోని రాత్రుళ్ళలో, పగళ్ళలో నలుపు తెలుపుల మధ్య ఇరుక్కున్న అనేకానేక నేనుల వలె రోజుటి ఈ నేను కాకూడదని! ఎన్నో అనుకున్నాను. ఇవాళ నా వయసెంత? గత సంవత్సరం కన్నా సంవత్సరం

పెద్ద. ఇరవై ఆరా? లేదూ ముప్పయి రెండా? లేక నలభై యేడా?

మెదడు పొడైపోయింది. అద్దంలోకి చూసుకున్నాను. ఫరవాలేదు. ముఖం ఓ మోస్తరుగా బాగానే ఉంది. ఎత్తైన నుదురు. సూటిగా చురుకుగా చూసే కళ్ళు. వంకర తిరిగిన కరవాలాల్లా సన్నని మీసాలు. మొత్తం మీద ఫరవాలేదని అనుకుంటున్న దశలో గుండె ఆగేంత పనైంది. తల వెంట్రుకల్లో ఓ తెల్లని వెంట్రుక కనిపించింది. అతి కష్టం మీద దాన్ని పీకేశాను. తల వెనక్కి తిప్పాను. ఇటూ అటూ తిప్పాను. బాగానే ఉందని తలనొప్పా? లేక పొద్దుటి నుండి టీ తాగనందుకు వచ్చిందా?

ఉదయం తొమ్మిది

హోటల్ యజమాని ముఖం అదోలా పెట్టుకున్నాడు. డబ్బులిమ్మని అడిగాడు. "రేపు ఇస్తా " నన్నాను.

"నిన్న అదే మాటన్నావు"

"ఇవ్వాళ డబ్బులేవైనా దొరకుతాయేమోననుకున్నాను".

మొత్తం డబ్బు కట్టేవరకు నాకు ఏదీ ఇవ్వకూడదని నా ముందే సర్వర్లకు చెప్పాడు హోటల్ యజమాని.

పదిగంటలు:

పెదాలు ఎండి పొయ్యాయి. గొంతులో తడిలేదు. ఎండ తీవ్రతకు నీరసం ఎక్కువవుతున్నట్లుంది. ఆ సమయంలో వచ్చారు ఇద్దరు చిన్నారి క్రిస్టియన్ బాలలు. సుమారు ఎనిమిది తొమ్మిదేళ్ళ వయసు. ఏవో చెక్క వస్తువులు తీసుకుని వచ్చారు. మూడు అణాలకు జత అని చెప్పారు.

"పిల్లలూ –నాకు అక్కరలేదర్రా " అన్నాను.

"ఎలా సర్? మీలాంటి వాళ్ళే అలా అంటే.. ఇక వేరే వాళ్ళేం కొంటారు?"

"నాకు అక్కరలేదు. పైగా డబ్బులు లేవు"

ఆ పిల్లలు నావైపు అనుమానంగా చూశారు. ఆ అమాయకపు కళ్ళకి వాస్తవాల్ని చూడగలిగే పరిణతి లేదు. అయినా పడక కుర్చీ తెల్లగుడ్డలు, జోళ్ళూ చూసి 'సర్' అని పిలిచారు. ఇందులో ఏ ఒక్కటీ నాది కాదని వాళ్ళకు తెలియదు. పోనీ ఈ శరీరం నాదా? ఈ విశాల భారతదేశంలో నేను తిరగని నగరముందా? ఎన్నెన్ని ప్రాంతాల్లో ఎన్నెన్ని రకాలుగా బతుకుతూ వచ్చాను. నా రక్తం, నా ఎముకలు, నా కండరాలు అన్నీ ఈ పవిత్ర భారతావనివే కదా? నాదంటూ ఏదైనా ఉందా? మిత్రులనే వాళ్ళున్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా కలకత్తా నుంచి కరాచి దాకా– ఆడాళ్ళు మగాళ్ళు దేశంలోని ప్రతి ప్రాంతంలో నా ప్రేమ, నా ఆత్మీయత ఈ దేశమంతా పొంగి పొర్లనీ. సుగంధ భరితమైన చల్లని చంద్రుని వెలుగువలె, నా ప్రేమ విస్తరించనీయ్. ఎవరికైనా నేను తెలుసా? ఎవరైనా నన్ను ప్రేమిస్తారా? అర్థం కాని నిగూఢ రహస్యాల ముసుగు లాగెయ్యడమే కదా జ్ఞానం చెయ్యగల పనీ? మనలోని లోపాల్ని, బలహీనతల్ని లాగేస్తే మిగిలేదేమిటీ? ప్రేమే కదా? ప్రేమించడం, ప్రేమించబడడం... ప్రతి ఒక్కరిని ఆకర్షించగలిగేది ఏదో ఒకటి ఉండాలి. అయినా సమయం ఎంత త్వరగా గడిచిపోయింది. మా నాన్న చూపుడు వేలు పట్టుకుని ఆడుతూ పాడుతూ ఉండేవాణ్ణి. అమ్మ కొంగు పట్టుకుని "అమ్మా! ఆకలే!!" అని అడిగేవాణ్ణి. ఇవ్వాళ ఎంత దుర్భరం? కాలం కదలనట్టు, ఊపిరి ఆడనట్టు. ఊహాభరితమైన ఆలోచనల బాంబులు నా హృదయం మీద పడి పేలిపోతున్నాయి. చెల్లాచెదరైన నా హృదయం ఇప్పుడొక భయానక, బీభత్స రణరంగం.. ఈరోజు నేనెవరూ? కమ్యూనిస్టునా? తిరుగుబాటుదారుణ్ణా? విప్లవకారుణ్ణా? వేదాంతినా? పేదవాణ్ణా? అసహాయుణ్ణా? ... అన్నీ కలిసిన వాణ్ణా???? నిజానికి నేనెవర్ని? నేనెవరినో నాకే తెలియదా? – అనుకోవడానికే ఇబ్బందిగా ఉందే? మరోవైపు తల పగిలిపోతోంది. పొద్దుటి నుండి టీ తాగనందుకేనా? తల కూడా ఎత్తలేకుండా ఉన్నాను. వెళ్ళి భోంచేస్తే కొంచెం కుదురుకుంటుందేమో? ఈ తలనొప్పితో ఇప్పుడో మైలు దూరం నడవాలి. తప్పదు. కనీసం కడుపైనా నిండుతుంది.

పదకొండు గంటలు:

హమీద్ తన దుకాణంలో లేడు. ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడా? నేనొచ్చే దాకా ఆగి, నన్ను వెంటబెట్టుకుని వెళితే బావుండేది. మరిచి పొయ్యాడేమో. నేను వాళ్ళింటికి వెళితే ఎలా ఉంటుంది?

పదకొండున్నర:

హమీద్ రెండంతస్తుల భవనపు ఇనుపగేట్లు మూసుకుని ఉన్నాయి. తలుపు తట్టాను

"హమీద్ భాయ్"

జవాబు లేదు.

"హమీద్ జీ"

ఓ మహిళ కోపంగా జవాబిచ్చింది.

"ఆయన లేరు"

"ఎక్కడికెళ్ళారండి?"

నిశ్శబ్దం. నేను మళ్ళీ తలుపు తట్టాను. ఓ నిమిషం ఆగి వెనక్కి తిరిగాను. ఇంతలో ఎవరో మెట్లు దిగి వస్తున్న చప్పుడు గాజుల చప్పుడు వినిపించింది. గేటువైపు చూశాను. గేటు తెరుచుకుంది.

"హమీద్ జీ ఎక్కడికెళ్ళారు?"

"ఎక్కడికో అర్జంటు పనుందని వెళ్ళారండి" చెప్పింది యువతి.

"ఎప్పుడొస్తారు?"

"తెలియదండి. సాయంత్రానికి వస్తారేమో"

"అబ్బో. అప్పటిదాకానా? సరే వచ్చాక నేనొచ్చి వెళ్ళానని చెప్పండి"

"ఎవరని చెప్పాలి?" ప్రశ్న. అవును. నేనెవరూ?" నాకు నేనే ప్రశ్నించుకుని "ఫరవాలేదులెండి. ఏమీ చెప్పనక్కర లేదు" అన్నాను.

వెనక్కి తిరిగి నడవడం ప్రారంభించాను. ఇసుక వేడి చేసిన పంచదారలా కాలిపోతోంది. విశాలమైన కొలను, నీళ్ళు అద్దంలా మెరిసిపోతున్నాయి. కళ్ళలో, తలలో చీకట్లు కమ్ముకున్నాయి. నా పరిస్థితి దయనీయంగా ఉంది. ఎముకలు మండి పోతున్నట్లు. దాహం... ఆకలి... వేళకింత తిండి సంపాదించుకోలేని తెలివి తేటలెందుకూ? ఓ ముద్దకూడా దొరకని రోజులు ఎన్నో ముందున్నాయని తెలుసు. ఏం చెయ్యడం? కుప్పకూలి పోయేట్లున్నాను.

పన్నెండున్నర:

పరిచయమున్న వాళ్ళంతా నన్ను చూడగానే వెళ్ళిపోతున్నారు. స్నేహితులారా! ఇవ్వాళ నా పుట్టిన రోజర్రా. కనీసం ఈ రోజైనా నన్ను సంతోష పెట్టండి. నా మనసులో నేనే గొణుక్కున్నాను. ఎవో కొన్ని నీడలు నా పక్కనుండే కదలి పోతున్నాయి. నేను కనబడ్డా ఎవరూ నన్ను చూడడం లేదెందుకూ?

నా వెనక ఓ సి.ఐ.డి – ఇతనెందుకూ?'

ఒంటిగంట:

శ్రీగారిదగ్గరికి వెళ్ళాను. ఆయన ఒకప్పుడు పత్రికా సంపాదకుడు. ఇప్పుడు వ్యాపారి. శ్రీ అడిగాడు "విప్లవం ఎంత దాకా వచ్చింది?"

"దగ్గర్లోనే ఉంది"

"హహ్హా ఏమైనా విశేషమా?"

" ఆఁ – ఏం లేదు. ఊరికే"

అతని పక్కనే కుర్చీలో కూర్చున్నాను. ఒకప్పుడు నా రచనలు అతని పేరుమీద ప్రచురింపబడ్డాయి. తన గొప్పతనం చాటు కోవడానికి వాటన్నిటినీ మంచి సంపుటాలుగా కూర్చుకున్నాడు. అందులో ఒకటి తీసి తిరగేస్తూ ఉన్నాను. నా తల తిరిగిపోతూ ఉంది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. వెంటనే ఓ కప్పు టీ కావాలి. చాలా అలసి పోయాను. హాయిగా, ప్రశాంతంగా క్యాష్ కౌంటర్లో కూర్చున్న శ్రీ గారికి నా పరిస్థితి అర్థం కావడం లేదా? మూగవేదనతో నేను వీధిలోకి చూస్తూ ఉండి పోయాను. చెత్త కుప్పలో పడి ఉన్న దోసె ముక్క కోసం ఇద్దరు కుర్ర బిచ్చగాళ్ళు కొట్టుకుంటున్నారు. నాలోని సర్వశక్తులన్నీ ఏకమై నన్ను బిచ్చమడిగాయి. 'ఓ కప్పు టీ కావాలి' అని! శ్రీ తన సిరిగల పెట్టె క్యాష్‌బాక్స్ తెరిచాడు. అందులో ఉన్నా ఎన్నో రూపాయల్లోంచి ఓ అణా తీసి, తన దగ్గర పని చేస్తున్న కుర్రాడికిచ్చాడు. "టీ పట్రా" ఆజ్ఞాపించాడు. కుర్రాడు టీ కోసం పరుగుదీశాడు. ఎందుకో నా హృదయం కాస్త చల్లబడింది.

(ముగింపు పైవారం)

కొత్త పుస్తకాలు

కనపడే దృశ్యాల లోతుల్ని తడిమే ప్రయత్నం



వెన్నెల బలపం,
కవితా సంపుటి,
రచయిత: కందుకూరి శ్రీరాములు,
వెల: రూ.50/-,
పేజీలు: 175,
ప్రతులకు:
విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ,
దిశ పుస్తకాల షాపులు.

జీవిత ప్రయాణంలో అనేక సంఘటనలను ఎదుర్కొంటూ మనిషి తన జీవితానుభవాన్ని పొందుతాడు. కవి ఆ సంఘటనల ప్రభావాలను కవిత్వ రూపంలో వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తాడు. ఆ వ్యక్తీకరణ ఎంత ప్రతిభావంతంగా సాగితే అంతగా ప్రయోజనం సాధించగలుగుతుంది. ఆయా సంఘటనలలోని వైరుధ్యాన్ని కవి పట్టుకుని సమర్థవంతంగా కళాత్మక విలువలతో ఆవిష్కరించగలగాలి. అతి కీలకమైన కవిత్వ వస్తువు పాఠకుడి గుండెల్లోకి దూసుకుపోవాలి. అది అంత సులభం కాదు. దాన్ని సాధించడం కోసం కవి నిరంతరం సాధన చేయాలి. ఆ ప్రయత్నం కొంత కందుకూరి శ్రీరాములు కవిత్వంలో కనపడుతుంది. ఇప్పటికే 'వయొలిన్ రాగమో వసంత మేఘమో', 'పీఠభూమి', 'కవ్వం', 'దహనకావ్యం' వంటి పలు కవితా సంపుటాలు ప్రచురించారు. వారి తాజా పుస్తకం 'వెన్నెల బలపం'.

హృదయానికి హత్తుకునే శీర్షికను పెట్టిన ఈ పుస్తకంలోని కవిత్వం పాఠకుడి హృదయాన్ని తాకుతుంది. అందరికీ అనుభవంలో ఉండే పలు అంశాలు ఈ పుస్తకంలోని కవితా వస్తువులయ్యాయి. ఈ కవి ఉపాధ్యాయుడు కావడం వల్ల భవిష్యత్ తరానికి ప్రాతినిధ్యం వహించే విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్దడం పట్ల లోతైన అవగాహన 'తుకం' అనే కవితలో వ్యక్తీకరిస్తారు-'పాఠశాల పొలంలో/ప్రతీ ఏటా పంటలు పండుతాయి/.... / పండాలిగానీ/ పాఠమైనా/ పంటయినా దేశానికి అభివృద్ధి' అని అంటాడు. మానవాళికి కీలకవనరుగా ఉన్న భూమితోనూ పంటతోనూ పోల్చి బాలల భవిష్యత్తును కవిత్వీకరించడం ఆకట్టుకుంటుంది. ఆహ్లాదం కోసమో, వినోదం కోసమో కాక కవిత్వం పాఠకుడిలో కొంత ఆలోచన రేకెత్తించడానికి ఈ కవిత్వం ద్వారా కవి ప్రయత్నం చేస్తాడు. ఎండిపోయిన తన ఊరిచెరువు జ్ఞాపకాలను గురించి రాసిన కవిత పాఠకుడిని గాఢంగా హత్తుకుంటుంది- 'దోసిటి నిండా మంచినీళ్ళు పట్టుకున్నట్టుండేది చెరువు/నీళ్ళు పుక్కిట పట్టినప్పుడు పొంగిన బుగ్గలున్నట్టుండేది చెరువు/ఈ చివర నుండి ఆ చివర దాకా/ నడుస్తుంటే రాజవీధిలా చెరువు/కట్టమీది నుంచి చూస్తుంటే నీటి తళతళలు/రాజుగారు ధరించిన పట్టువస్త్రాల జరీమెరుపులా చెరువు' అని తన ఊరు 'రావురూకుల చెరువు' ను వర్ణిస్తూ పరవశంతో రాస్తాడు- అలాంటి చెరువు ఎటువంటి స్థితికి చేరిందో చెబుతూ 'స్వర్గధామంగా ఉన్న చెరువు నరకకూపమైంది/షార్ట్‌కట్‌ల బండ్లబాటయ్యింది/ బహుదూరపు బాటసారులకు బహిర్భూమయ్యింది/ ఊరందరిని పూడ్చిపెట్టేంత గొయ్యయ్యింది' అని వాపోతాడు. ఈ కవిత అనేక చెరువుల దుస్థితిని పాఠకుడికి దృశ్యం కట్టిస్తుంది.

గోవాలో సముద్రాన్ని చూసి కవి స్పందించిన తీరు బావుంది- 'పల్లె చెమటను పన్నీరుగా ప్రేమించిన నేను/ ఉప్పు సముద్రపు ఉప్పెనలో కలిసిపోవటం ఇష్టంలేదు/ చారెడు మంచినీళ్ళే/ భూమిని తవ్వితే దాహం తీరుతుంది/ మూడొంతుల నీళ్ళు ఎన్నుంటే ఏం...?/ నాక్కొన్ని నీళ్ళు చాలు/ కళ్ళల్లో కాంతులు మొలకెత్తటానికి/ అలసిన మొహమ్మీద తుంపరలై కురవడానికి/ నా గుండె దాహం ఆగకుండా చేయడానికి/ భూమిలో ఇంకి వరిమొక్క మొలవడానికి/ ఆవిరై ఆకాశంలో మెరవడానికి/ చినుకై నదిని అవ్వడానికి' (గోవా) అంటాడు.

ఈ సంపుటిలోని చాలా కవితలు వైవిధ్యభరితంగా సాగుతాయి. భిన్నమైన ప్రతీకలతో అతిశయోక్తులకు పోకుండా వ్యక్తీకరణ వాస్తవికంగా ఉంటుంది. కవి తన సాహిత్య, సామాజిక నిబద్ధతను కూడా ఒక కవితలో వ్యక్తీకరిస్తాడు – 'కసువు చిమ్మిన చేయి/ కత్తి పడుతుందని చదివాను/ అమ్మా ఆవు అన్న నోరు/ దేశమూ ప్రపంచమూ అని చెబుతుందని విన్నాను/ కథలూ కవితలూ అర్థం చేసుకున్న మెదడు/ సమాజమూ సాహిత్యమూ అంటుందని తెలుసుకున్నాను" అంటాడు 'కదన వేదిక' కవితలో. అలాగే కవిత్వం ఎలా ఉండాలో కూడా కవి వర్ణిస్తాడు- భూమ్మీద/ అక్కడక్కడ పచ్చని చేలున్నట్టు/ కనిపిస్తుండాలి కవిత్వం/ ఎండలో రోడ్డు మీద ప్రయాణించి ప్రయాణించి/ పచ్చని నీడలో ఊపిరి తీసుకున్నట్టుండాలి' (చుక్కల్లో సూర్యుడు' కవితలో కవి కవిత్వం గురించి ఎలా ఉండాలో చెప్పాడు.

కొన్ని కవితల్లో సంక్లిష్టత పాఠకుల్ని ఇబ్బంది పెడుతుంది. అలాగే కొన్ని కవితలు సుదీర్ఘంగా ఉండి వాటిలో కవిత్వం పలుచబడింది. వర్తమాన కవి కవితా వస్తువు విషయంలోనే కాదు అభివ్యక్తిలో, శిల్పంలో కూడా రాజీపడకూడదు. పదునైన కవిత్వం కోసం కవి మరింత పదునుగా ఉండాలి. సెల్‌ఫోన్ పోయిన సంఘటనను గురించి రాసిన కవిత, అలాంటివే మరి రెండు మూడు కవితలు సీరియస్‌నెస్‌ను తగ్గిస్తాయి. అలాంటి పోయెమ్స్ ఈ సంపుటిలో లేకపోతే బావుండేది. కొన్ని కవితల్లో సూటిదనం లోపించింది. పాఠకుడు కొంత అస్పష్టతకు లోనయ్యే అవకాశం ఉంది. వెరసి మొత్తంగా చూసినప్పుడు మంచి కవిత్వంగా 'వెన్నెల బలపం' గురించి చెప్పవచ్చు.

- వరప్రసాద్



మన పద్య యోగులు
(సమకాలీన పద్య కవుల పరిచయం)
యస్. కె. చంద్రసేన్
వెల : 80/-, పేజీలు : 192.
ప్రతులకు : యస్. కె. చంద్రసేన్
ఇ.నెం.11-12-164,
రోడ్ నెం.6,
యస్. ఆర్.కె పురం,
హైదరాబాద్-35.
మరియు
పి. రాజేశ్వరరావు
ఇ.నెం. 22-44, వివేకానంద
నగర్, దిల్‌షుక్ నగర్,
హైదరాబాద్-500060

బూరల బొమ్మలు

కొంతమంది వుంటారు చూశారూ.... అబ్బబ్బ ... మాటల్లో చెప్పలేం. వాళ్ల చేతిలో ఏది పెట్టినా కళాఖండాలను సృష్టించేస్తారు. ఇదిగో చూశారుగా. సరదాగా బూరలతో ఆడుకో బాబూ! అని కాసిని బూరలిస్తే...ఇలా వస్తువులను, వాహనాలను, మనుషులను, జంతువులను, తినుబండారాలను, భవనాలను, ఈతకొలనులను చేసిపారేశాడో అపరిచితుడు. పరిశీలనగా చూడండి. అవన్నీ అచ్చంగా బూరలతో చేసినవే. అయినా ఇలా చేయడానికి ఎన్ని తెలివితేటలుంటాలి! మామూలు బుర్రలతో అయ్యేపనేనా! కాదు కాక కాదు. మరీ ఎక్కువగా గాలి కొడుతున్నట్టనిపిస్తోందా! బూరల సంగతి కదా. మొదలెట్టగానే ఇలా వచ్చేస్తున్నాయ్ కబుర్లు. ఏమైనా బూరల బొమ్మలు చూసి ఎంజాయ్ చేసేయండి! వీలైతే ఇరుగుపొరుగుకూ ఈ ఆనందాన్ని పంచండి.



కుందేలు తెలివి

-కె. సాహిల్

జరిగినకథ:

ఓ అడవిలో సింహం వుండేది. దానికి ఆకలి అనిపిస్తే చాలు! కనపడిన జంతువునల్లా చంపి తినేసేది. ఈ బాధ పడలేక జంతువులన్నీ కలిసి దానితో ఒక ఒప్పందం చేసుకుంటాయి. సింహానికి ఆహారంగా రోజుకో జంతువును పంపిస్తామని మాట ఇస్తాయి. ఒకవేళ మాట తప్పితే మాత్రం ఎప్పటిలా కనిపించిన జంతువునల్లా చంపుకు తినమంటాయి. ఇచ్చిన మాట ప్రకారం రోజుకో జంతువును పంపిస్తుంటాయి కూడా. అలా ఒకరోజు ఓ బుల్లి కుందేలు వంతు వస్తుంది. దానికేమో సింహానికి ఆహారంగా వెళ్లడం ఇష్టంలేదు. తనను తాను కాపాడుకోవాలనుకుంటుంది. వీలైతే ఇతర జంతువులను కూడా కాపాడాలనుకుంటుంది. అనుకోగానే పనవ్వదు కదా. ఓ ఉపాయం ఆలోచిస్తుంది. కావాలనే సింహం గుహ దగ్గరకు ఆలస్యంగా వెళుతుంది. సింహం బాగా ఆకలిమీద వుంటుంది. పైగా ఆహారంగా వచ్చిన కుందేలు బాగా చిన్నగా వుండడంతో కోపం వస్తుంది. ఆ తర్వాత...

◆ ◆ ◆

"నిన్ను ఇక్కడికి ఎవరు పంపించారు? బాగా చిన్నగా వున్నావు. ఎలా తినేది నిన్ను?" అంటుంది సింహం.

దానికి కుందేలు పిల్ల వినయంగా తల వంచి "ఓ రాజా! దయచేసి నేను చెప్పేది వినండి. జరిగింది వింటే మీరు నన్నుగానీ... ఇతర జంతువులను గానీ కోప్పడరు. నేను మరీ చిన్నగా వుంటానని జంతువులన్నిటికీ తెల్సు. అందుకే మీకు ఆహారంగా ఆరు కుందేళ్లను పంపాయి. అయితే దారిలో ఐదు కుందేళ్లను మరో సింహం చంపి తినేసింది...." అని చెప్తుండగానే...

"మరో సింహమా...? ఎవరది? నువ్వు దాన్ని ఎక్కడ చూశావు?" అనడిగింది సింహం కోపంగా.

"అది చాలా పెద్ద సింహం. అది పెద్ద గుహ లోంచి బయటికి వచ్చింది. అసలుకైతే నన్ను కూడా చంపాలని చూసింది. కానీ దానికి నేను అసలు విషయం చెప్పాను. మా రాజుగారైన మీ ఆహారం కోసం మేం వెళ్తున్నామని చెప్పాను. రాజుగారి భోజనాన్ని లాక్కుని తినేశావన్నాను. కానీ అది వినలేదు. పైగా 'మీ రాజు ఎవరు?' అనడిగింది. 'అడవిలో కెల్లా పెద్ద సింహం' అని చెప్పాన్నేను. అది పెద్దగా గర్జిస్తూ... "తెల్సా! నేను ఒక్కణ్ణే రాజుని. మిగతా జంతువులన్నీ నా సేవకులే. నేను వాటిని ఏమైనా చేస్తాను. నువ్వు చెప్పావే రాజని! వాడు మోసగాడు. వాణ్ణి నా ఎదురుగా నిలబెట్టు. అసలు రాజు ఎవరో చెప్తాను" అంటూ అది నన్ను మీ దగ్గరకి పంపింది" అంది కుందేలు.

అంతా విన్న తర్వాత సింహం కోపంగా పెద్దగా గర్జించింది. దాంతో అడవంతా ఒక్కసారిగా వణికిపోయింది.

"ఆ తెలివితక్కువ సింహం ఎక్కడ వుంటుందో చూపించు. నేను దాన్ని చూసేవరకు, చంపేవరకు నాకు మనశ్శాంతి లేదు" అంది పెద్దగా.

"తప్పకుండా రాజా! దాన్ని చంపాల్సిందే. నేను కనక మీలా పెద్దగా వుండివుంటే అప్పడే అక్కడే దాన్ని ముక్కలుముక్కలు చేసి చంపేసేదాన్ని. కానీ నా సంగతి తెల్సుకదా. అర్భకురాలిని" అంది కందేలు అమాయకంగా.

"ఊ...నాకు దారి చూపించు...నాకు దారి చూపించు" అంటూ ముందుకు కదిలింది సింహం.

"తప్పకుండా రాజా! మీరు నాతో రండి. కానీ కోటలో వున్న శత్రువుని ఎదుర్కోవడం చాలా కష్టం. గుర్తుంచుకోండి మహారాజా" అంది.

"అదంతా నాకు వదిలేయ్. ఇంతకీ అదెక్కడుంది?"

"బహుశా మీరు రావడం చూసి ఈ కోటలో దూరి వుంటుంది. రండి మహారాజా! మీకు దాన్ని చూయిస్తాను" అంటూ కుందేలు ఒక బావి దగ్గరకు తీసుకెళ్లింది సింహాన్ని. బావి నీళ్లల్లో సింహం ప్రతిబింబం దానికి కనిపించింది. అంతే అది కోపంగా అరిచింది. బావి లోపలి నుంచి సింహం అరుపు ప్రతిధ్వనించింది. ఆ శబ్దం బహుశా తన ప్రత్యర్థి అరుపనుకుంది సింహం. ఆ తర్వాత ఒక్కక్షణం కూడా ఆగలేకపోయింది. శత్రువును చంపడానికి బావిలోకి దూకేసింది. అంతే దాని తల రాళ్లకు కొట్టుకుని పగిలిపోయింది. స్పృహ తప్పిన సింహం నీళ్లల్లో మునిగిపోయి చనిపోయింది.

చిన్నారి కుందేలు వెంటనే ఇంటికి తిరిగి వెళ్లి జరిగినదంతా చెప్పింది. అప్పటి వరకు తమను చంపుకుతిన్న సింహం పీడ వదిలినందుకు జంతువులన్నీ పండుగ జరుపుకున్నాయి ఆనందంగా. కుందేలు తెలివిని మెచ్చుకున్నాయి.

(అయిపోయింది)